

PRGI Regd. No : APTEL/26/A0819

నేటిపత్రిక

# ప్రజాసీమ

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రచురణ : వైయస్ఆర్ కడప జిల్లా | సంపుటి : 01 | సంచిక: 62 | శనివారం 13, జూన్ 2026 | పేజీలు : 08 | వెల: 02

Circulated At YSR Kadapa, Annamayya, Vijayawada, Tirupathi, Chittor, Kurnool, Nandyal, Ananthapur, Puttaparthi, SPSR Nellore, VIshakapatnam, East Godavari, West Godavari



**విలేకరులు కావలెను.**

నిజాన్ని నిర్భయంగా ప్రచురిస్తూ
పత్రికా రంగంలో కొత్త ఒరవడిని సృష్టిస్తున్న
నేటి దినపత్రిక ప్రజాసీమ పత్రికలో పనిచేసేందుకు
నియోజకవర్గ ఇన్‌చార్జులు,
మండల విలేకరులు కావలెను

సంప్రదించవలసిన నెంబర్లు
8074596109, 9676747256


## ఏపీలో చీకటి పాలన పోయి..
# ప్రజాపాలన వచ్చింది



తిరుపతి, జూన్ 12 : 2024 ఎన్నికల్లో కూటమి అఖండ విజయం సాధించిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాన్ని గెలిపిద్దాం.. ప్రజాస్వామ్యాన్ని కాపాడదామని ప్రజలను కోరామని తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తైన సందర్భంగా రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరుతో తిరుపతిలోని దామినేడులో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం ప్రసంగిస్తూ.. 2024లో 57 శాతం ఓట్ షేర్.. 94 శాతం స్ట్రయిక్ రేట్ సాధించామని చెప్పుకొచ్చారు. 2024లో రాష్ట్రాన్ని ప్రజలే కాపాడుకున్నారని అన్నారు. తన రాజకీయ ప్రయాణం తిరుపతిలోనే మొదలైందన్నారు. రాష్ట్రం, దేశం బాగుండాలని కోరుకునే వ్యక్తి పవన్ అని చంద్రబాబు వెల్లడించారు.

**జగన్ చేసిందేమీ లేదు...**

వైసీపీ పాలనలో రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని సీఎం విమర్శించారు. ప్రజా వేదిక కూల్చివేతతో జగన్ అరాచక పాలన మొదలైందన్నారు. కేంద్ర పథకాలు,

2లో



2లో

## ప్రజల తీర్పే చరిత్రను మార్చింది..
## ఏపీ పునర్నిర్మాణానికి కూటమి
# కట్టుబడి ఉంది

- ప్రజాస్వామ్యంలో తుది నిర్ణేతలు ప్రజలేనన్న పవన్
- విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకున్నామని వ్యాఖ్య

జూన్ 12 : ప్రజాస్వామ్యంలో అంతిమ న్యాయనిర్ణేతలు ప్రజలేనని, వారి తీర్పును మించిన శక్తి ఏదీ లేదని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. 2024 ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు

## జగన్ తప్పుడు ఆరోపణల
# గుట్టు బట్టబయలైంది



- డీఎస్సీపై జగన్ రెడ్డి తప్పుడు ప్రచారం చేశారని ఆరోపణ
- వాస్తవాలు, డేటాతో జగన్ ఆరోపణలు అబద్ధాలని తేలిపోయిందన్న లోకేశ్
- న్యాయస్థానాలు కూడా ఆ వాదనలను కొట్టిపారేశాయని వెల్లడి
- యువతకు అనవసర ఆందోళన కలిగించినందుకు జగన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్

జూన్ 12 : మాజీ ముఖ్యమంత్రి జగన్ డీఎస్సీ విషయంలో తప్పుడు ప్రచారం చేసి, అభ్యర్థులను తప్పుదోవ పట్టించారని, దీనికి గాను ఆయన ఆంధ్రప్రదేశ్ యువతకు క్షమాపణ చెప్పాలని రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ డిమాండ్

2లో

## పెద్దారెడ్డిపై పోలీసులు
# కేసు నమోదు



**దీక్ష విరమించిన జేసీ ప్రభాకర్ రెడ్డి**

అనంతపురం, జూన్ 12 : వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపై తాడిపత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో తాడిపత్రి పోలీస్ స్టేషన్ ఎదుట మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి దీక్ష విరమించారు. కేతిరెడ్డి పెద్దారెడ్డిపై 196 (1) BNS సెక్షన్ కింద పోలీసులు కేసు నమోదు చేశారు. రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేశారంటూ సదరు వైసీపీ నేతపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇక దీక్ష విరమించిన అనంతరం జేసీ ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఎదుట తమ సమస్య తేల్చుకుంటామన్నారు. సోమవారం ఎస్పీ

2లో

## మమతా బెనర్జీపై
# కోల్‌కతాలో ఎఫ్ఐఆర్



- నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో మమతపై ఓ స్థానికుడి ఫిర్యాదు
- ఓ బహిరంగ కార్యక్రమంలో మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడారన్న ఫిర్యాదుదారుడు
- సమాజంలో వైషమ్యాలు పెంచేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని ఫిర్యాదు

పశ్చిమ బెంగాల్, జూన్ 12 : పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్ నమోదైంది. దక్షిణ కోల్‌కతాలోని నేతాజీ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఓ స్థానికుడు ఇచ్చిన ఫిర్యాదు

2లో

## తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు
# పూర్తి స్వేచ్ఛ ఉంది



న్యూఢిల్లీ, జూన్12: తెలంగాణకు వచ్చేందుకు.. వెళ్లేందుకు.. పోటీ చేసేందుకు.. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ప్రజలకు వ్యతిరేకంగా మాట్లాడినందునే.. పవన్ కల్యాణ్‌పై తమ మంత్రులు మాట్లాడారన్నారు. తనకు హిట్లర్ ఆదర్శం అని తానెప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో ఉన్నవారు ఎవరైనా.. హిట్లర్ తమకు ఆదర్శం అని చెబుతారా? అని ప్రశ్నించారు. పార్టీ అధిష్ఠానంతో జరిగిన సమావేశంలో మంత్రివర్గ విస్తరణపై చర్చ జరగలేదని

2లో

PRGI Regd. No : APTEL/26/A0819

ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# జగన్ తప్పుడు ఆరోపణల గుట్టు బట్టబయలైంది

చేశారు. జగన్ చేసిన ప్రతి ఆరోపణను వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించామని ఆయన అన్నారు. ఈ మేరకు లోకేశ్ ట్వీట్ చేశారు. "జగన్ రెడ్డి సృష్టించిన తప్పుడు ప్రచారం ఇప్పుడు పూర్తిగా బట్టబయలైంది. ఆయన చేసిన ప్రతి ఆరోపణను మేం వాస్తవాలు, డేటాతో సహా తప్పని నిరూపించాం. మేము మొదటి నుంచి ఏం చెబుతున్నామో అదే నిజమని ఇప్పుడు రుజువైంది. మా వాదనను న్యాయస్థానాలు కూడా సమర్థించాయి. జగన్ చేసిన నిరాధార ఆరోపణలను కోర్టులు కొట్టివేశాయి. దీంతో ఈ నియామక ప్రక్రియలో మా నిజాయతీ మరోసారి నిరూపితమైంది. లక్షలాది మంది అభ్యర్థులను తప్పుదోవ పట్టించి, వారిలో అనవసర ఆందోళన కలిగించిన ఆయన వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ పరిణామాలతో ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు పూర్తి విశ్వాసంతో ముందుకు సాగుతోంది. వేలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులకు అవకాశాలు కల్పిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాం. ఇంత జరిగిన తర్వాత, రాష్ట్ర యువతను తప్పుదోవ పట్టించినందుకు వైఎస్ జగన్ గారు వారికి బేషరతుగా క్షమాపణ చెప్పాలి. ఇది మా డిమాండ్" అంటూ నారా లోకేశ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# తెలంగాణలో పోటీ చేసేందుకు పవన్ కల్యాణ్‌కు పూర్తి స్వేచ్ఛ ఉంది

చెప్పారు. ప్రధాని నరేంద్ర మోదీతో జరిగిన భేటీలో తనను ఆయనే కౌగిలించుకున్నారని.. తాను కౌగిలించుకోలేదని సీఎం రేవంత్ వెల్లడించారు. తెలంగాణపై కేంద్రం వివక్ష చూపుతోందని సీఎం రేవంత్ ఆరోపించారు. బీఆర్ఎస్ కార్య నిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదేశాలను ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పాటిస్తున్నారని విమర్శించారు. పలు ప్రాజెక్టులకు నిధులు విడుదల కాకపోవడానికి కిషన్‌రెడ్డే కారణమని కుండబద్దలు కొట్టారు. రీజినల్ రింగ్ రోడ్డుకు కూడా కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారని గుర్తు చేశారు. తుమ్మిడిహెట్టి కోసం మహారాష్ట్ర సీఎంతో కిషన్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణ కోసం ప్రధానితో ఒక్కసారైనా మాట్లాడారా? అని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

గాడ్సేనే కాదు.. కిమ్‌ను కూడా బీజేపీ ఆదర్శంగా తీసుకుందని సీఎం రేవంత్ రెడ్డి వ్యంగ్యంగా అన్నారు. బీజేపీకి తెలిసింది ఓట్ చోరీ.. లేకపోతే సీట్ చోరీ అని ఎద్దేవా చేశారు. మధ్యప్రదేశ్‌లో సంఖ్యాబలం లేకపోయినా మూడో అభ్యర్థిని నిలబెట్టినప్పుడే బీజేపీ దుర్బుద్ధి బయటపడిందన్నారు. మీనాక్షి నామినేషన్ తిరస్కరణ అప్రజాస్వామిక చర్య అని అభివర్ణించారు. ఆమె నామినేషన్ తిరస్కరణ అత్యంత బాధాకరమన్నారు. మీనాక్షి నటరాజన్‌పై అసలు కేసే లేదని స్పష్టం చేశారు. మహిళా వ్యతిరేకి బీజేపీ అని సీఎం రేవంత్ విమర్శించారు.

# మమతా బెనర్జీపై కోల్‌కతాలో ఎఫ్ఐఆర్

ఆధారంగా కేసు నమోదు చేసినట్లు సమాచారం. గత మార్చిలో ధర్మతలలో జరిగిన ఓ బహిరంగ కార్యక్రమంలో మమత చేసిన వ్యాఖ్యలు మతపరమైన విభేదాలను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ఫిర్యాదుదారుడు ఆరోపించారు. ఒక వర్గాన్ని లక్ష్యంగా చేసుకుని చేసిన వ్యాఖ్యలు సమాజంలో భయాందోళనలు, వైషమ్యాలు పెంచేలా ఉన్నాయని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. మే నెలలో ఫిర్యాదు అందగా, తాజాగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇదిలా ఉండగా, ఇటీవల జరిగిన రాజకీయ పరిణామాలు కూడా టీఎంసీకి సవాళ్లను తెచ్చిపెడుతున్నాయి. ఎన్నికల ఫలితాల తర్వాత పార్టీలో అంతర్గతంగా అసంతృప్తి పెరుగుతోందనే చర్చ సాగుతోంది. కొందరు నాయకులు పార్టీకి దూరమవుతుండగా, మరికొందరు తమ రాజకీయ భవిష్యత్తుపై కొత్త నిర్ణయాలు తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో నెలకొన్న ఈ పరిణామాలు మమతా బెనర్జీ నాయకత్వానికి పరీక్షగా మారాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు చట్టపరమైన వివాదాలు, మరోవైపు పార్టీ అంతర్గత అసంతృప్తి నేపథ్యంలో టీఎంసీ భవిష్యత్‌పై చర్చ మరింత వేడెక్కుతోంది. ఈ పరిస్థితుల్లో మమతా బెనర్జీ తదుపరి రాజకీయ వ్యూహం ఎలా ఉండబోతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చింది

సాగునీటి ప్రాజెక్టులను పక్కన పడేశారని మండిపడ్డారు. అప్పులు, అరాచకాలు, ఆర్థిక విధ్వంసం తప్ప జగన్ చేసిందేమీలేదని విమర్శించారు. అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారన్నారు. కేసులు, జైళ్లతో చీకటి పాలన సాగించారని దుయ్యబట్టారు. అలాంటి దశలో నాలుగోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఏపీలో చీకటి పాలన పోయి.. ప్రజాపాలన వచ్చిందన్నారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ఆక్సిజన్ ఇచ్చి కేంద్రం బతికించిందని చెప్పుకొచ్చారు. అమరావతి, పోలవరం, రైల్వే జోన్ అంశాల్లో కేంద్ర సహకారం దక్కిందన్నారు. అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

అన్ని వర్గాలనూ ఆదుకున్నాం..

ఆర్థిక ఇబ్బందులున్నా.. ఇచ్చిన హామీలు నెరవేరుస్తున్నామని చంద్రబాబు తెలిపారు. ఎక్కడా లేనివిధంగా ఏపీలో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యాలతో ముందుకెళ్తున్నామని చెప్పారు. 63 లక్షల మందికి చీ= భరోసా పెన్షన్లు అందజేశామని, ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ తల్లికి వందనం పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు ఏడాదికి రూ.20 వేలు అందజేస్తున్నామన్నారు. రైతులు, గీత కార్మికులు, వడ్డెర్లు, చేనేతలు సహా అన్ని వర్గాలను ఆదుకున్నామని తెలిపారు. P4 ప్రయోగంతో ఆర్థిక అసమానతలను తగ్గించామన్నారు.

21వ శతాబ్దం ప్రధాని మోదీదే..

21వ శతాబ్దం ప్రధాని మోదీదే అని సీఎం స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్‌తో దేశానికి మోదీ ఆత్మస్థైర్యం ఇచ్చారన్నారు. 2047 నాటికి భారత్ ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా మారుతుందని ధీమా వ్యక్తం చేశారు. మోదీ పాలనలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడించారు. పుట్టపర్తిలో ఐదో తరం ఫైటర్‌జెట్ తయారుకాబోతోందన్నారు. తిరుపతిలో బుల్లెట్ ఫ్యాక్టరీ వస్తోందని, రాయలసీమ ఇప్పుడు బంగారుసీమ కాబోతోందన్నారు. వచ్చే నెలలో రాయలసీమ స్టీల్ ప్లాంట్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. జొన్నవాడలో బంగారం వెలికితీస్తామన్నారు. గ్రీన్ ఎనర్జీ, సోలార్, విండ్ పవర్‌పై దృష్టి సారించినట్లు చెప్పారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తయారుచేస్తున్నామని తెలిపారు. రూ.లక్ష కోట్లతో రాయలసీమ ముఖచిత్రాన్ని కాపాడతామన్నారు. కల్యాణి డ్యామ్‌కు ఈ ఏడాది నీళ్లు తీసుకొస్తున్నామన్నారు. 3 రాజధానుల పేరుతో మూడుముక్కలాట ఆడారని మండిపడ్డారు. '3 రాజధానులు కాదు.. 3 ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం' ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ప్రజల తీర్పే చరిత్రను మార్చింది.. ఏపీ పునర్నిర్మాణానికి కూటమి కట్టుబడి ఉంది

కేవలం ప్రభుత్వ మార్పునకు మాత్రమే పరిమితం కాలేదని, రాష్ట్ర భవిష్యత్తుకు కొత్త దిశను నిర్దేశించిందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం ప్రజలు కూటమిపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా తిరుపతి సమీపంలోని దామినేడులో నిర్వహించిన 'రెండేళ్ల నమ్మకం.. అభివృద్ధి, సంక్షేమం' బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చారిత్రక విజయానికి కారణమైన ప్రజలకు, కూటమి శ్రేణులకు పవన్ కృతజ్ఞతలు తెలిపారు. "రెండేళ్ల క్రితం ప్రజలు మాకు కేవలం అధికారాన్ని ఇవ్వలేదు.. ఒక పెద్ద బాధ్యతను అప్పగించారు. అహంకారం, విధ్వంసక రాజకీయాలపై ప్రజాస్వామ్యం సాధించిన విజయమే 2024 ఎన్నికల ఫలితం. రాష్ట్ర అభివృద్ధి కోసం, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడం కోసం కూటమి ఏర్పడింది. అధికారాన్ని పంచుకోవడం కోసం కాదు.. బాధ్యతను పంచుకోవడం కోసం ఈ కూటమి ముందుకొచ్చింది" అని పవన్ అన్నారు. జనసేన కేవలం 21 స్థానాల్లో పోటీ చేసినప్పటికీ, ప్రజల ఆశీర్వాదంతో అన్ని స్థానాల్లో విజయం సాధించడం తమపై ప్రజలు ఉంచిన విశ్వాసానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధికి కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అలాగే ఎన్‌డీయే ప్రభుత్వ సమష్టి కృషి వల్ల విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణను అడ్డుకోగలిగామని తెలిపారు. దేశంలో అత్యధిక కాలం నిరంతరాయంగా ఎన్నికైన ప్రధానమంత్రిగా కొనసాగుతున్న నరేంద్ర మోదీకి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. ఇటీవల జరిగిన విశాఖ స్టీల్ ప్రమాదంలో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరమని పవన్ పేర్కొన్నారు. ఆ దుర్ఘటన కారణంగానే ఈ నెల 9న జరగాల్సిన కార్యక్రమాన్ని వాయిదా వేసి ఇప్పుడు నిర్వహిస్తున్నామని చెప్పారు.

# పెద్దారెడ్డిపై పోలీసులు కేసు నమోదు.. దీక్ష విరమించిన జేసీ ప్రభాకర్ రెడ్డి

కార్యాలయంకు అనుచరులతో కలిసి వెళ్తామని చెప్పారు. ఈ ఆందోళనకు.. తెలుగుదేశం పార్టీకి సంబంధం లేదని కుండబద్దలు కొట్టారు. కేవలం జేసీ ప్రభాకర్ రెడ్డితోపాటు అనుచరులు మాత్రమే వెళ్తామని చెప్పారు.

తాడిపత్రిలో తాము ఉండాలా? లేదా అనేది ఎస్పీని అడుగుతామని జేసీ ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు.

# గుడివాడ నియోజకవర్గంలో 2.04 లక్షల మంది ఓటర్లు

## – సర్ ప్రక్రియ సోమవారం నుంచి ప్రారంభం: ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం




గుడివాడ, (ప్రజా సీమ)జూన్ 12: ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఓటర్ల వివరాలు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – సర్ ప్రక్రియపై పూర్తి వివరాలు వెల్లడించారు. గుడివాడ నియోజకవర్గ పరిధిలో మొత్తం 2 లక్షల 4 వేల 963 మంది ఓటర్లు ఉన్నట్లు ఆర్డీవో తెలిపారు. 2002లో జరిగిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఓటర్ల జాబితాతో ఇప్పటివరకు 1 లక్ష 59 వేల 120 మందిని మ్యాపింగ్ చేసినట్లు చెప్పారు. ఇంకా 45 వేల 843 మంది ఓటర్ల మ్యాపింగ్ మిగిలి ఉందని, వీరందరినీ కూడా 2002 ఓటర్ల జాబితాతో మ్యాపింగ్ చేస్తామన్నారు. ఎన్నికల సంఘం సూచనల మేరకు శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు, ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని ఆర్డీవో పేర్కొన్నారు. మిగిలిన ఓటర్ల వివరాలను బీఎల్ఓలు డోర్ టు డోర్ వెరిఫై చేసి సేకరిస్తారని, వేరే ప్రాంతాల్లో ఉన్న ఓటర్లు కూడా బీఎల్ఓలకు తమ వివరాలు అందించవచ్చని సూచించారు.

**సర్ ప్రక్రియ వివరాలు:** సోమవారం నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పూర్తిస్థాయిలో ప్రారంభమవుతుందని ఆర్డీవో తెలిపారు. బీఎల్ఓలు అందరూ తమ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఇళ్లకు వెళ్లి రెండు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని చెప్పారు. కుటుంబంలోని అందరి వివరాలను ఫారంలో నమోదు చేసుకోవచ్చన్నారు. బీఎల్ఓలు మూడుసార్లు ఇళ్లకు వస్తారని, పూర్తి చేసిన ఫారాల్లో ఒకటి బీఎల్ఓ తీసుకుంటారని, రెండోది ఎక్నాలెడ్జ్మెంట్ కింద ఓటర్లు భద్రపరుచుకోవాలని సూచించారు. బీఎల్ఓలతో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు కూడా ఇంటి సందర్శనలో పాల్గొంటారని, స్థానికంగా ఉన్న వారి వివరాలను బీఎల్ఓలకు తెలియజేయవచ్చని, ప్రతిరోజు 50 వరకు ఫారాలను బూత్ ఏజెంట్లు బీఎల్ఓలకు అందించవచ్చని ఆర్డీవో వివరించారు.

**షెడ్యూల్:** మొదటి దశలో జూన్ 15 నుంచి జులై 14 వరకు ఎన్యుమరేషన్ ఫారాలు సేకరిస్తామని, సేకరించిన ఫారాలను ఆన్లైన్ చేస్తామని చెప్పారు. జులై 15 నుంచి 20 వరకు రేషనలైజేషన్ చేసి పోలింగ్ కేంద్రాలను ఖరారు చేస్తామని, ప్రతి కేంద్రంలో 1200 ఓటర్లు మించకుండా చూస్తామని, అవసరమైతే పోలింగ్ కేంద్రాలను పెంచడం కూడా జరుగుతుందన్నారు. జులై 21న డ్రాఫ్ట్ ఓటర్ లిస్ట్ ప్రచురిస్తామని, అప్పుడు మిస్సయిన ఓటర్లు, కొత్తగా నమోదు చేసుకోవాలనుకున్న వారు, ఇతర రాష్ట్రాల నుంచి బదిలీపై వచ్చిన వారు జులై 21 నుంచి ఆగస్టు 20 వరకు నేరుగా ఫారం 6, ఫారం 8 ద్వారా ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. నెలరోజుల పాటు దరఖాస్తులు స్వీకరించి 60 రోజుల్లో పరిశీలించి సెప్టెంబర్ 22న ఫైనల్ ఓటర్ లిస్ట్ ప్రచురిస్తామని ఆర్డీవో వెల్లడించారు. ఆన్లైన్లో నమోదు చేసుకున్న వాటిని డౌన్లోడ్ చేసి బీఎల్ఓలతో విచారణ చేయిస్తామని చెప్పారు. గుడివాడ నియోజకవర్గ పరిధిలోని ఓటర్లు అందరూ ఎన్యుమరేషన్ ప్రాసెస్లో బీఎల్ఓలకు సహకరించాలని ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం విజ్ఞప్తి చేశారు. ఈ ప్రక్రియపై సందేహాలు, మరింత సమాచారం కోసం ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950 లేదా అధికారిక వెబ్సైట్ను సంప్రదించవచ్చని తెలిపారు.

# అధికారుల సమక్షంలో నియోజకవర్గ భూత్ లెవెల్ అవగాహన సదస్సు








(ప్రజా సీమ)జూన్ 12 (కైకలూరు): నియోజకవర్గంలోని నాలుగు మండలాలలో మండల రెవెన్యూ అధికారులతో కలిసి ఎలక్షన్ కమిటీ డిప్యూటీ కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బి.జే.పీ.,తెలుగుదేశం, జనసేన,వై.ఎస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ, వివిధ పార్టీలకు చెందిన నియోజకవర్గ బి.ఎల్.ఏ. 1 లతోనూ,మండల బూత్ లెవెల్ ఇంచార్జ్ లతోనూ,గ్రామ ములోని బూత్ లెవెల్ ఎజెంట్లతోనూ సమావేశం నిర్వహించి, 1982 నుండి ఇప్పటి వరకు,1987 నుండి ఇప్పటి వరకు, ప్రస్తుతం వున్న ఓటర్ల జాబితా ననుసరించి, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి నూతన ఓటు వేసే హాక్కుని కల్పించాలని, మరణించిన వారి ఓట్లు,వివాహావై గ్రామంలోలేని మహిళల ఓటులు, ఇతర రాష్ట్రాలలో గాని,విదేశాల లో గాని వున్న వారి ఓట్లు విచారణ చేసి అధికారుల ద్వారా జారీ చేయబడిన పత్రాలు లో వ్రాసి వారి,వారి మండలాల రె వెన్యూ తహసీల్దార్ కి తెలియచేసి, పత్రాలు అందించాలని,ఒకే వ్యక్తి పేరుమీద వున్న అనేక ఓట్లు లో ఒక్క చోటే ఓటు వేసేలా అన్ని పార్టీలు ఒక్కటిగా కలసి నూతన ఓటర్ల జాబితాను తయారు చేయటానికి ఎలక్షన్ కమిషన్ ఆదేశాలు జారీ చేసిందని, గ్రామ బూత్ లెవెల్ ఏజెంట్ ప్రతి ఒక్కరికి ప్రభుత్వ యాప్ ద్వారా గ్రామంలో ని ప్రతి ఇంటి వద్ద విచారణ చేసే సమయంలో అనుమానం వున్న ఎడల ప్రభుత్వ యాప్ ద్వారా తెలుసుకొని పత్రాలు పూర్తిచేసి అందించటానికి గ్రామ బూత్ లెవెల్ ఎజెంట్ కి నేటి నుండి ఒక్క నెలరోజులు మాత్రం గడువు నిర్ణయించిందని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల తాసిల్దార్లు అన్ని పార్టీల బూత్ లెవెల్ నియోజకవర్గ మండల గ్రామస్థాయి ఇన్చార్జిలు,ఏజెంట్లు పాల్గొన్నారు.

# గాలివానకు కుప్పకూలిన భారీ వృక్షం

## - రాకపోకలకు అంతరాయం
## -చిట్వేలి రాజంపేట ప్రధాన రహదారిపై ఘటన



చిట్వేలి(ప్రజా సీమ)చిట్వేలి మండల పరిధిలోని సి కందులవారిపల్లె, పంచాయితీ అక్షర హై స్కూల్ సమీపాన చిట్వేలి నుండి రాజంపేటకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్న భారీ వేప చెట్టు చిన్నపాటి వానగాలికి ప్రధాన రహదారిపై నేలకొరిగింది. శుక్రవారం, సాయంత్రం ఐదు గంటల సమయంలో చిన్న పార్టీవాన గాలి రావడంతో సుమారు 100 సంవత్సరాలు ఉన్న వేపచెట్టు నేలకొరిగింది. రాకపోకలకు అంతరాయం కలిగింది. అక్కడే ఉన్న పెట్రోల్ బంక్ లో నుండి రాకపోకలు సాగించేలా చేశారు. మండల వ్యాప్తంగా ప్రధాన రహదారిపై ఇలాంటి ప్రమాదానికి సిద్ధంగా ఉన్న మరికొన్ని వృక్షాలు ఉన్నట్లు సమాచారం ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా ఉన్న చెట్లను ముందుగా తొలగించి తగిన జాగ్రత్తలు తీసుకుంటే రాబోవు వర్షాకాలంలో ఇలాంటి ఘటనలు తలెత్తకుండా ఉంటాయని తగిన చర్యలు ఆర్ అండ్ బి అధికారులు తీసుకోవాలని చిట్వేలి మండల ప్రజలు కోరుతున్నారు.

# రీ-సర్వే తో అధికారులకు కాసుల పంట

## -భూ సమస్యలను ఆసరాగా చేసుకుని రైతుల నుంచి వసూళ్లు

కలకడ (ప్రజా సీమ):అన్నమయ్య జిల్లా కలకడ మండలంలో ఇటీవల నిర్వహించిన రీ-సర్వే ప్రక్రియపై రైతుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. రీ-సర్వే పేరుతో భూముల వివరాల్లో చోటుచేసుకున్న పొరపాట్లు, ఒకరి పేరుపై ఉన్న భూములు మరొకరి పేర్లకు ఆన్‌లైన్‌లో నమోదవుతున్న ఘటనలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన కొందరు వీఆర్వోలు రైతుల ఇబ్బందులను ఆసరాగా చేసుకుని భారీగా డబ్బులు వసూలు చేస్తున్నారంటూ పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.మండలంలోని పలు గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ అనంతరం భూ రికార్డుల్లో అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, తమ పూర్వీకుల నుంచి సాగుచేస్తున్న భూములు కూడా ఇతరుల పేర్లకు మారిపోయాయని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు, సంబంధిత వీఆర్వోలు “పని త్వరగా జరగాలంటే ఖర్చు అవుతుంది” అంటూ పరోక్షంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.భూముల పేర్ల మార్పులు, సరిహద్దుల వివాదాలు, ఆన్‌లైన్ రికార్డులలో తప్పులు వంటి అంశాలు రైతులను తీవ్ర మానసిక ఆందోళనకు గురిచేస్తున్నాయి.సమస్య పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించినా నెలల తరబడి పనులు పెండింగ్‌లో ఉంచుతూ, చివరకు డబ్బులు చెల్లించిన వారి ఫైళ్లకే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.రీ-సర్వే ప్రక్రియలో గ్రామాలకు ముందస్తు సమాచారం ఇవ్వకపోవడం, భూ యజమానుల సమక్షంలో కొలతలు చేపట్టకపోవడం, స్థానిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా ఆన్‌లైన్ నమోదులు చేయడం వల్లే ప్రస్తుతం అనేక వివాదాలు తలెత్తుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దీనివల్ల గ్రామాల్లో రైతుల మధ్య విభేదాలు, పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం రైతుల




ప్రయోజనాల కోసం చేపట్టిన రీ-సర్వే ప్రక్రియను కొందరు అధికారులు ఆదాయ మార్గంగా మార్చుకున్నారనే ఆరోపణలు రావడం ఆందోళన కలిగిస్తోంది. భూ సమస్యలతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్న రైతుల నుంచి అక్రమ వసూళ్లు జరుగుతున్నాయనే ఆరోపణలపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను వెలికితీయాలని రైతులు కోరుతున్నారు.అలాగే రీ-సర్వేలో జరిగిన తప్పులను సత్వరమే సరిదిద్దడంతో పాటు, రైతులకు పారదర్శకంగా సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, అక్రమాలకు పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల రైతాంగం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.ఈ విషయంపై కలకడ మండల తహసీల్దార్‌ను వివరణ కోరగా, మండలంలో రీ-సర్వే ప్రక్రియ ప్రభుత్వ నిబంధనల ప్రకారమే సక్రమంగా జరుగిందని తెలిపారు. రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులను పరిశీలిస్తున్నామని, ఎవరైనా వీఆర్వోలు లేదా ఇతర సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్లు ఆధారాలతో తేలితే వారిపై శాఖాపరమైన విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# చిట్వేలు ఎన్‌సీసీ క్యాడెట్లకు బంగారు పతకాలు

## -ఎన్సిసి విద్యార్థులకు అభినందనలు తెలియజేసిన ఉపాధ్యాయులు




చిట్వేలు(ప్రజా సీమ):తిరుపతి జిల్లాలోని పీఎం శ్రీ జడ్పీ ఉన్నత పాఠశాల, చిట్వేలు ఎన్‌సీసీ క్యాడెట్లు ఈనెల 1వ తేదీ నుండి పదవ తేదీ వరకు తిరుపతి మోహన్ బాబు, యూనివర్సిటీలో జరిగిన కంబైన్డ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ లో ప్రతిభ కనబరిచి బంగారు పథకాలు సాధించారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు, ఎన్సిసి ట్రూప్ కమాండర్ పసుపుల రాజశేఖర్, తెలిపారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దుర్గరాజు మాట్లాడుతూ విద్యార్థులలో ఉన్న కృషి, క్రమశిక్షణ, అంకితభావం ఈ విజయానికి కారణమని తెలిపారు.ఈ సందర్భంగా ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్, మాట్లాడుతూ, విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సమర్థవంతంగా ప్రదర్శించి ఈ ఘనత సాధించారని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పథకాలు సాధించిన వారిలో చెంజి అక్షయ, గోర్ల వైష్ణవి, దీక్ష, హర్షప్రియ, గీతిక ఉన్నారు.బంగారు పతకాలు సాధించిన క్యాడెట్లను ఉపాధ్యాయుని ఉపాధ్యా యులు, తల్లిదండ్రులు మరియు తోటి విద్యార్థులు అభినందించారు.

# వెలుగు సంస్థలో టిబి ముక్త భరత్ అభియాన్

## - బొమ్మనచెరువు వైద్య బృందంచే వైద్యశిబిరం





మదనపల్లె (ప్రజా సీమ) : పట్టణంలోని అమ్మచెరువుమిట్ట నందు గల వెలుగు సంస్థ నందు శుక్రవారం బొమ్మనచెరువు వైద్య బృందం విచ్చేసి టిబి ముక్త భరత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.వెలుగు సెక్రటరీ ఎం.ఉదయమోహన్ రెడ్డి,ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు,సూపర్ వైజర్ శ్రీనివాసులు (ఎంపీహెచ్ఎస్),వారి బృందాన్ని సాదరంగా ఆహ్వానించగా వృద్దులు,చిన్నారులు స్వాగతం పలికారు.వెలుగు సంస్థలోని వృద్ధులు,సిబ్బందికి టిబి పరీక్షలలో భాగంగా 70 మందికి ఎక్సరే తీయడం జరిగింది.ఈ సందర్భంగా ఎంపీహెచ్ఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ టిబి అనే వ్యాధి చాలా భయంకరమైనదని,ఈ వ్యాధి సోకిన వ్యాధిగ్రస్తుడు చాలా బలహీనులు అయిపోతారని,టిబి అనే వ్యాధి ఒక్క వ్యక్తికి సోకినట్లయితే,ఇది 14 మందికి వ్యాపిస్తుందని,డాక్టర్ పర్యవేక్షణలో తగు పరీక్షలు,మందులు,సలహాలు తీసికోవాలని ఈయన తెలియజేశారు.ఎం.ఉదయమోహన్ రెడ్డి మాట్లాడుతూ టిబి ముక్త భరత్ అభియానులో భాగంగా బొమ్మనచెరువు వైద్య బృందం వెలుగు సంస్థకు విచ్చేసి,మా సంస్థలోని వృద్ధులకు,సిబ్బందికి మొత్తం 70 మందికి టిబి పరీక్ష నిర్ధారణ కొరకు ఎక్సరేలను తియ్యడం మాకెంతో సంతోషంగా ఉందని,ఈ శిబిరం ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సీహెచ్ఓలు పి.శ్రావణి,యం.సాయి గణేష్,కనకమ్మ ఏఎన్ఎం,రెడ్డి కుమారి ఆశా వర్కర్,యస్.శివజ్యోతి ఆశ వర్కర్,నిస్సి గ్రేసీ ఆశ వర్కర్,టిబి సిబ్బంది టి.బి.హెచ్.విలు యం.సుశీల,ఎల్.వనజ కుమారి,ఎఫ్.సునీత,వెలుగు సెక్రటరీ ఎం.ఉదయ్ మోహన్ రెడ్డి,కన్వీనర్ ఆర్.భాగ్యలక్ష్మి,వెలుగు ప్రిన్సిపాల్ పి.లీనాకుమారి,సోషల్ వర్కర్ గీత,వార్డెన్ స్వీటీ,ఏఎన్ఎం గీతాంజలి,వృద్దులు,సిబ్బంది పాల్గొన్నారు.

# కూటమి రెండేళ్ల పాలనపై రాష్ట్ర ప్రజలలో తీవ్ర వ్యతిరేకత

## - పోలవరం,అమరావతి తప్ప రాష్టాభివృద్ధి శూన్యం - మదనపల్లె వైసిపి ఇంచార్జి నిస్సార్ అహమ్మద్ విమర్శలు - మదనపల్లెలో వైకాపా నిరసన ర్యాలీ విజయవంతం







మదనపల్లె (ప్రజా సీమ) : ఎపిలో కూటమి రెండేళ్ల పాలన కేవలం అమరావతి,పోలవరం వరకు మాత్రమే పరిమితమైందని,సూపర్ సిక్స్ హామీలు సూపర్ ఫ్లాప్ అని,రెండేళ్ల కూటమి పాలన ప్రోగ్రెస్ రిపోర్ట్ అట్టర్ ఫ్లాప్ అని మదనపల్లె వైస్సార్సీపీ సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ విమర్శలు గుప్పించారు.రాష్ట్ర వైఎస్సార్సీపీ అధిష్టానం పిలుపు మేరకు నిస్సార్ అహమ్మద్ ఆద్వర్యంలో శుక్రవారం మదనపల్లెలో మిషన్ కాంపౌండ్ నుంచి చిత్తూరు బస్టాండు వాల్మీకి సర్కిల్ వరకు వెన్నుపోటుకు రెండేళ్ళు అంటూ నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి,సీనియర్ నాయకులు ఎన్.శ్రీనాథ్ రెడ్డి,మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ మనుజా రెడ్డి,మాజీ కౌన్సిలర్లు హాజరయ్యారు.ఇందులో భాగంగా కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు.ఈ సందర్భంగా చిత్తూరు బస్టాండు సర్కిల్ వద్ద నిస్సార్ అహమ్మద్,డాక్టర్ దేశాయ్ తిప్పారెడ్డిలు మీడియాతో మాట్లాడుతూ కూటమి రెండేళ్ల పాలనపై వైఎస్సార్సీపీ అధిష్టానం పిలుపు మేరకు చంద్రబాబు నాయుడు వెన్నుపోటు పాలనకు రెండేళ్లు,జూన్ 4 నుంచి 12 వరకు చేపట్టే నిరసన కార్యక్రమాలు నియోజకవర్గంలో సక్సెస్ అయ్యాయని వివరించారు.రాష్ట్రంలో కూటమి అధికారం చేపట్టిన రెండేళ్లలో భూ కబ్జాలు,అత్యాచారాలు పెట్రెగిపోయాయని ఆరోపించారు.సూపర్ సిక్స్ హామీలలో ఇచ్చిన ఆడబిడ్డల నిధి,నిరుద్యోగ బృతి అమలు చేయలేదని,రెండేళ్ళుగా ఇచ్చిన హామీ అమలు చేయకుండా మోసం చేశారన్నారు.బిఆర్ నాయడు లాంటి వ్యక్తులు టిటిడి చైర్మనుగా వుండటం దురదృష్టకరమని,రాష్ట్రంలో ఎటూ చూసిన కల్తీ మద్యం,బెల్టుషాపులు రాజ్య మేలుతున్నాయిని ధ్వజమత్తారు.రాష్ట్రాన్ని మద్యాంధ్రాప్రదేశ్ గా మార్చేశారని ఆరోపణలు చేశారు.పేద విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందనే గొప్ప లక్ష్యంతో జగన్మోహన్ రెడ్డి 17 మెడికల్ కాలేజీలు తీసుకు వస్తే,వాటిని కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని నిప్పులు చెరిగారు.పిపిపి విధానంలో అమలు చేసి సొంత వారికి లబ్ది చేకుర్చాలని సిఎం చంద్రబాబు నాయుడు చూస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం అవినీతి,అక్రమాలు ప్రశిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు.మామిడి రైతాంగానికి గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని గుర్తు చేశారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజలు సంతోషంగా ఉన్నారని,మళ్ళీ జగన్మోహన్ రెడ్డి పాలన రావాలని ప్రజలు బలంగా కోరుకున్నారని పేర్కొన్నారు.మెగా డిఎస్సీ దగా డిఎస్సీ అయిందని ఎద్దేవా చేశారు.ఎస్సీ,ఎస్టీ,మైనారిటీలకు 50 ఏళ్లకే ఇస్తామని చెప్పిన పించను ఏమైందని,కొత్త పెన్షన్ ఏ ఒక్కరికి ఇచ్చిన దాఖలాలు లేవని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో మేధావులు ఫోరం రాష్ట్ర కార్యదర్శి వి.ఎస్ రెడ్డి,మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నూర్ అజామ్,లియాఖత్ అలీ,బి.ఏ.ఖాజా,మండల ప్రధాన కార్యదర్శి మహేష్ బాబు,వలసపల్లి నాగరాజ రెడ్డి,నిమ్మనపల్లి శ్రీనివాసులు రెడ్డి,కోటూరు ఈశ్వర్,కొండుపల్లి ప్రసాద్ బాబు,చిప్పిలి మల్లికార్జున రెడ్డి,క్వాలిటీ నట్స్ తాజ్ బాషా,షేక్ జావీద్,కొత్తపల్లి నాగార్జున నాయుడు,హబీబ్,3వ వార్డు నూర్,మహమ్మద్ యూనస్,యువ నాయకుడు పవన్ తేజ,చిప్పిలి నరసింహారెడ్డి,చెన్నకృష్ణ,శారదా రెడ్డి,మంజుల,వినుతా భాయి,ధనలక్ష్మి,నాగమణి వైసిపీ నాయకులు,కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం సభ సూపర్ హిట్

## - టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి హర్షం
## - సభకు హాజరైన రామకృష్ణ ఆచారి,పఠాన్ ఖాదర్ ఖాన్,నాగూర్ వలి



మదనపల్లె (ప్రజా సీమ) : ఏపీలో తెలుగుదేశం - జనసేన - బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా తిరుపతి నగరం దామినేడులో శుక్రవారం రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం పేరిట ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ సూపర్ సిక్స్ అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పచ్చిపాల తులసి హర్షం వ్యక్తం చేశారు.ఈ సభకు ఆమెతో పాటు మదనపల్లి నుండి రాజంపేట పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి,ఉర్దూ అకాడమీ స్టేట్ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్,విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పచ్చిపాల రామకృష్ణ ఆచారి,ఆర్టీసీ 1,2 డిపోల ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు నాగూర్ వలి (షో ఆఫ్ శీను),మాజీ కౌన్సిలర్ సాకె లక్ష్మీదేవి,బావ జాన్ తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన విధ్వంసం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నారన్నారు.సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు సూపర్ హిట్ కావడంతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని,అదేవిధంగా రాష్ట్రానికి పెట్టుబడులు,పరిశ్రమలు పెద్దసంఖ్యలో తరలిరావడం ఏపీ అభివృద్ధికి సంకేతమని కొనియాడారు.భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు.

# అన్ని వర్గాలను దగా చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు

## -"చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమంలో " మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు.

## - రైల్వే కోడూరు లో కదం తొక్కిన వైసీపీ శ్రేణులు.





రైల్వే కోడూరు (ప్రజా సీమ):మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, రైల్వే కోడూరు మాజీ ఎమ్మెల్యే, వైసీపీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి కొరముట్ల శ్రీనివాసులు ఆధ్వర్యంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5 మండలాలకు చెందిన పార్టీ నాయకులు, మాజీ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డు సభ్యులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం నుంచి రైల్వే స్టేషన్ వరకు, అక్కడి నుంచి స్థానిక వైఎస్సార్ విగ్రహం వరకు భారీగా వైసిపి శ్రేణులు ర్యాలీగా రహదారుల వెంట కదం తొక్కి కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి, మహిళల భద్రత, రైతు సంక్షేమం, వలస కూలీలకు సహాయం వంటి అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించలేకపోయిందని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు సృష్టించడంలో ప్రభుత్వం వెనుకబడిందని, పెన్షన్ల విషయంలో కూడా అన్యాయం జరిగిందని ఆరోపించారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ అంశంపై మాట్లాడుతూ, తమ ప్రభుత్వ హయాంలో కర్మాగార కార్మికులకు ప్రమాదాలు జరిగితే బాధిత కుటుంబాలకు రూ. 1 కోటి పరిహారం అందించామని తెలిపారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణ ఉద్యోగుల భవిష్యత్తును దెబ్బతీస్తుందని పేర్కొంటూ, అధికారంలో ఉన్న సమయంలో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయడంతో పాటు పార్లమెంటులో కూడా తమ పార్టీ ఎంపీలు గళం వినిపించారని చెప్పారు. మహిళల భద్రత, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల సంక్షేమానికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి అండగా నిలిచిందని ఆయన అన్నారు. ధరల పెరుగుదల, పెట్రోల్--డీజిల్ ధరల భారంపై కూడా ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోతే ప్రజా సమస్యలపై మరింత ఉధృతంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఓబులవారిపల్లె మండల కన్వీనర్ సాయి కిషోర్ రెడ్డి, పుల్లంపేట మండల కన్వీనర్ ముస్తాక్, సీనియర్ నాయకులు మాదినేని వెంకట్ రెడ్డి, మందల నాగేంద్ర, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ సుబ్బరామరాజు, మలిశెట్టి వెంకటరమణ, నందా బాల, జడ్పీటీసీ రత్నమ్మ, తల్లెం భరత్ కుమార్ రెడ్డి, శివారెడ్డి, సింగమాల సతీష్ రెడ్డి, సీహెచ్ రమేష్, లింగం లక్ష్మీకర్, మైనారిటీ నాయకులు సుంకేసుల రఫీ, మడగలం శ్రీను తదితర నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏపిఎండీసీ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలి

## -పెండింగ్ లో ఉన్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలి.

## -ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి.



రైల్వే కోడూరు (ప్రజా సీమ )మంగంపేట ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల సమావేశం ఏపీఎండీసీ అడ్మినిస్ట్రేషన్ ఆఫీస్ ముందు గల ఏఐటీయూసీ జెండా ఆవరణలో జరిగినది. ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరు మురళి మాట్లాడుతూ ఏపీఎండిసి నందు పనిచేయు కార్మికుల సమస్యలు సంవత్సరాల తరబడి పెండింగ్లో ఉన్నాయని వాటి పరిష్కారం కొరకు యాజమాన్యంతోను అసిస్టెంట్ లేబర్ కమిషనర్ గారితోను పలుమార్లు చర్చలు జరిపినా యాజమాన్యం దాటవేత ధోరణి అవలంబిస్తున్నది. సంస్థ అభివృద్ధి కొరకు ఇల్లు భూములు ఇచ్చి 18 సంవత్సరాలుగా ఔట్సోర్సింగ్ ట్రైనింగ్ పద్ధతిలో పనిచేయు కార్మికులను ఖాళీగా ఉన్నటువంటి రెగ్యులర్ పోస్టుల్లో భర్తీ చేస్తామని చెప్పడం జరిగినది. ఇప్పటివరకు దానిమీద సరైన స్పందన లేదు. రెగ్యులర్ కార్మికులకు దాదాపు మూడు సంవత్సరాల నుండి ప్రమోషన్లు ఇవ్వడం లేదు. ప్రమోషన్ పోస్టులు ఉన్నా కూడా అక్కడే పని చేయు రెగ్యులర్ కార్మికులు చాలా బాధ పడుతున్నారు. ఏపీఎండిసి యాజమాన్యం వారు సంస్థ అభివృద్ధి కోసం ఇల్లు భూములు ఇచ్చి ఉద్యోగం పొంది అనారోగ్యంతో చనిపోయిన కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించేవారు. రెండు సంవత్సరాల నుండి చనిపోయిన కార్మిక కుటుంబాల్లో ఉద్యోగం ఇవ్వక పోవడంతో ఆ కుటుంబాలు ఇప్పుడు ఆర్థికపరమైన సమస్యలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నాయి. చనిపోయిన కుటుంబాలకు ఏపీఎండీసీ వారు 10 లక్షలు ఇన్సూరెన్స్ చేయించడం జరిగినది. 2023-2024 సంవత్సరంలో చనిపోయిన కార్మికులకు మాత్రం డెత్ ఇన్సూరెన్స్ పెండింగ్ లో ఉన్నది. పెండింగ్‌లో ఉన్న డెత్ ఇన్సూరెన్స్ ఇచ్చి ఆ కుటుంబాల్ని ఆదుకోవాలి. ఏపీఎండిసి నందు ఐదు సంవత్సరాలు పనిచేసే చనిపోయిన కార్మికులకు, 18 సంవత్సరాలు పనిచేసి రిటైర్డ్ అయిన కార్మికులకు గ్రాట్యుటీ అమౌంట్ ఇవ్వడం లేదు. ఏదైనా సంస్థలో ఐదు సంవత్సరాలు పని చేసి ఉంటే వారికి గ్రాట్యుటీ ఇవ్వాలని చట్టంలో ఉన్న కానీ అమలు పరచడం లేదు. ప్రతి సంక్రాంతి పండగకు గిఫ్ట్ అమౌంట్ ఇచ్చేవారు. రెండు సంవత్సరముల నుండి గిఫ్ట్ అమౌంట్ ఇవ్వకుండా ఆపి ఉన్నారు. ప్రస్తుతం మైన్స్ నందు ఏ అండ్ బి ఖనిజనిక్షేపాలు తక్కువగాను సి అండి కానీ నిక్షేపాలు ఎక్కువగా ఉన్నవి. లోగ్రేడ్ ఖనిజమైన సి అండ్ డి ఖనిజాన్ని హైగ్రేడ్ ఖనిజంగా మార్చే బెనిఫిసియేషన్ ప్లాంట్ ఏర్పాటుచేసి మంగంపేట బ్రాంచ్ ని మరియు సంస్థను అభివృద్ధి చేయాలి.. గతంలో ఏపీఎండిసి వారు ఓఎన్ జిసి కంపెనీకి పౌడర్ సప్లై చేయడంతో సంస్థ కు ఆదాయం చేకూరడం జరిగినది. ఓఎన్ జిసి కంపెనీకి ఏపీఎండిసి వారే పౌడర్ సప్లై చేసి సంస్థకు ఆదాయం వచ్చేలా చేయాలి. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎంప్లాయిస్ యూనియన్ ఏఐటీయూసీ గా తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో ఏపీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు బత్తల హరి, పుల్లగంటి బాలు, నారదాసు మణికంఠ, గుంటా భానుప్రకాష్, నోసిన నరసింహులు, పసుపులేటి సురేష్ బాబు, కొట్టెడి సాయి, గ్రందే మణికంఠ, దండు సురేష్ బాబు, గుంటిగోగుల నరసింహచారి, చౌడవరం సురేష్ బాబు, పసుపులేటి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# వీక్లీ వన్స్ డాక్టర్ పై విచారణ










రాజంపేట (ప్రజా సీమ): రాజంపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగేశ్వర్ రాజు పై విచారణకు ఆదేశాలు. వీక్లీ వన్స్ డ్యూటీ చేస్తున్నట్లు ఆరోపణలు రావడంతో రాజంపేట ప్రభుత్వాసుపత్రిని తనిఖీ చేస్తున్న జిల్లా అధికారులు. నాగేశ్వరరాజు విధులకు గైర్హాజరవ్వడం పై వార్త కథనాల ప్రసారం అవడంతో సూపర్డెంట్ కు తలనొప్పి గా మారిన విచారణ. వార్త కథనాల పై విచారణకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా డి.సి.హెచ్.ఎస్ అధికారి. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్న టూ మెన్ కమిటీ సభ్యులు. విచారణ చేపట్టిన వారిలో జమ్మలమడుగు, పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్లు. గతంలోనూ అనేక ఆరోపణలు రావడం తో, విధులకు హాజరు కాకపోవడంతో విచారణ చేసిన అధికారులు. ప్రస్తుత విచారణ కమిటీపై అనేక అనుమానాలు అవుతున్నాయి. రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో సూపర్డెంట్ అందుబాటులో లేకపోవడంతో సామాన్య మధ్యతరగతి పేద ప్రజలకు దూరమవుతున్న వైద్యం. ఓపి సైతం మధ్యాహ్నం 1 గంటలకే నిలిపేసి ఇంటికి వెళున్న సిబ్బంది. సిబ్బందిపై చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమైన సూపరింటెండెంట్ నాగేశ్వర రాజు. వంద పడకల ఆసుపత్రికి దూర ప్రాంతాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో చికిత్స కోసం వస్తున్న ప్రజలు. సూపరింటెండెంట్ నాగేశ్వరరాజు పై విచారణకు వచ్చిన ఇద్దరు సమాన హోదా అధికారులు కావడంతో అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. శక్తి వంచన లేకుండా సూపర్డెంట్ ను కాపాడే ప్రయత్నం చేస్తున్న ఏవో భూమిరెడ్డి అని సమాచారం. ఫీ=చా ( ఫేసియల్ రికగ్నిషన్ సిస్టమ్ ) యాప్ లో సాంకేతిక నిపుణులు తో మార్పులు చేసుకొని డ్యూటీ కి ఎక్కడ నుంచైనా హాజరు వేసుకునే విధంగా సిద్ధం చేసుకునట్లు సిబ్బంది గుసగుసలు. నాగేశ్వరరాజుకు క్లిన్ చిట్ ఇచ్చే విధంగా పథకాన్ని రచించిన ఇద్దరు జిల్లా స్థాయి అధికారులు. ఈ విచారణ తుతూమంత్రంగా జరుగుతుందే తప్ప చర్యలు శూన్యం అనే బావనలో హాస్పిటల్ సిబ్బంది గుసలు గుసలు.

# ప్రయాణికుల భద్రత గాలికి

## -నిర్లక్ష్యం అంచున రైల్వే శాఖ -పుల్లంపేటలో దారుణ పరిస్థితి






పుల్లంపేట(ప్రజా సీమ)తిరుపతి జిల్లా పుల్లంపేట రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టేషన్‌కు పైకి ఎక్కే ప్రధాన దారి పూర్తిగా నిర్లక్ష్యానికి గురై ప్రమాదకరంగా మారిందని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే స్టేషన్‌కు చేరుకోవాలంటే ప్రయాణికులు ఇరుకైన మట్టి దారిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ఒక వైపు కంపచెట్లు, మరోవైపు ఎత్తుపల్లాలతో కూడిన మార్గం ఉండటంతో వృద్ధులు, మహిళలు, చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ దారి మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని స్థానికులు చెబుతున్నారు. అంతేకాకుండా, ఆ దారికి ఆనుకుని గతంలో ఉన్న బావి ప్రస్తుతం గుంతలా మారి ప్రమాదాన్ని పొంచి ఉంచుతోంది. రాత్రి వేళల్లో లేదా అత్యవసర పరిస్థితుల్లో ఆ మార్గంలో ప్రయాణించే వారు ప్రమాదవశాత్తు అందులో పడిపోయే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు చర్యలు తీసుకోవాలని రైల్వే శాఖను కోరుతున్నారు. పుల్లంపేట రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం కొద్ది రైళ్లు మాత్రమే ఆగుతున్నప్పటికీ, ప్రయాణికుల భద్రత విషయంలో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. స్టేషన్‌కు సరైన మెట్ల మార్గం, రక్షణ గోడలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పక్కనున్న గుంతలు, బావిని పూడ్చి సురక్షితమైన రాకపోకల మార్గాన్ని కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. "ప్రయాణికుల ప్రాణ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రమాదం జరిగిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే, ముందుగానే సమస్యను గుర్తించి పరిష్కరించాలి" అని పుల్లంపేట ప్రజానీకం రైల్వే అధికారులను కోరుతోంది. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు స్పందించి, ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే మరమ్మత్తులు చేపట్టి సురక్షిత మార్గాన్ని ఏర్పాటు చేస్తారా? అనే ప్రశ్నకు సమాధానం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు"

## - కలకడ లో వైఎస్సార్సీపీ నిరసన ర్యాలీ..







కలకడ(ప్రజా సీమ)వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" అనే నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం కలకడలో నిర్వహించారు. ఈ కార్యక్రమం పీలేరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సుందరమ్మ హోటల్ నుంచి కలకడ బస్టాండ్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వరకు వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్సార్ విగ్రహంవద్దకు చేరుకున్నరు. మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన "బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ" బాండ్లు, మేనిఫెస్టో పత్రాలు, సూపర్ సిక్స్ హామీల ప్రతుల విషయం లో కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, మహిళలకు 45 ఏళ్లకే పెన్షన్ వంటి అనేక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. అదేవిధంగా నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇటీవల చేపట్టిన డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో భారీ అవినీతి చోటుచేసుకుందని, అక్రమాలకు పాల్పడి పలువురికి ఉద్యోగాలు కట్టబెట్టారని ఆరోపించారు. అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తవుతున్నా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, ఇకనైనా కళ్లుతెరిచి ఎన్నికల హామీలనుఅమలుచేయాలని రాష్ట్రంలోని ప్రతి వర్గాన్ని కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందని ఆరోపిస్తూ, తమ నిరసన కార్యక్రమం ద్వారా ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న టీడీపీ నేత మంద శ్రీను

## - రక్తపు మడుగులో ఉన్న వ్యక్తికి సకాలంలో సహాయం





పుల్లంపేట(ప్రజా సీమ)రాజకీయ కార్యక్రమాల హడావిడిలోనూ ఓ టీడీపీ నేత తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు. ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణదాతగా నిలిచారు.?ప్రమాద వివరాల్లోకి వెళ్తేతిరుపతిలో జరుగుతున్న ఎన్డీఏ విజయోత్సవ సభకు హాజరయ్యేందుకు టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మంద శ్రీనివాసులు (మంద శ్రీను)శుక్రవారం కారులో తిరుపతికి బయలుదేరారు. ఈ క్రమంలో పుల్లంపేట సమీపంలోని అప్పయ్యరాజు పేట వద్ద ఒక కారు ఘోరంగా ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఒళ్లంతా రక్తసిక్తమై, రోడ్డుపై ఆ వ్యక్తి ప్రాణాలకై విలవిలలాడుతున్నాడు.?స్పందించిన నేత.. సకాలంలో వైద్యంఅటుగా వెళ్తున్న మంద శ్రీనివాసులు ఆ దారుణ దృశ్యాన్ని చూసి తీవ్రంగా చలించిపోయారు. క్షణం కూడా ఆలస్యం చేయకుండా వెంటనే తన వాహనాన్ని ఆపి, స్థానిక పోలీసులకు మరియు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. అంబులెన్స్ వచ్చే వరకు అక్కడే ఉండి, గాయపడిన వ్యక్తిని సురక్షితంగా, సకాలంలో ఆసుపత్రికి తరలించేలా దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేశారు. తీరిక లేని షెడ్యూల్ ఉన్నప్పటికీ, తోటి మనిషి ప్రాణాన్ని కాపాడటమే ప్రథమ కర్తవ్యంగా భావించి మంద శ్రీను వ్యవహరించిన తీరుపై స్థానికులు మరియు పార్టీ శ్రేణుల నుండి అభినందనలు వ్యక్తమవుతున్నాయి. ఆయన చూపిన మానవత్వాన్ని పలువురు కొనియాడుతున్నారు.

# ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం

## -రైల్వే ఉన్నతాధికారులకు స్థానిక సమస్యలపై వివరిద్దాం





రాజంపేట (ప్రజా సీమ).కడప జిల్లా రాజంపేట నియోజకవర్గం రాజ్య సభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి గారి ఆఫీసు గుంతకల్లు రైల్వే మరియు డిఆర్సిసి నెంబర్ ,రాయలసీమ బూత్ కమిటీ అధ్యక్షులు తల్లెం భరత్ కుమార్ రెడ్డి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథ్ రెడ్డిని కలవడం జరిగినది, మేడా రఘునాథరెడ్డి గారు రైల్వే కి సంబంధించిన సమస్యలు,తమ మాట్లాడి రేపు రైల్వే జిఎం రాజంపేటకు రామన్న సందర్భంలో పలు స్టాపేజ్ విషయాలు, అండర్ బ్రిడ్జి సమస్యలు, బెంగళూరు వయా కడప మీదుగా రేణిగుంట కు పోయే పలు విషయాలు గురించి చర్చించడం జరిగినది.

# దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలి

## - ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య

## -ఎస్సీ హోదా పై బాలకృష్ణన్ కమిషన్‌కు సమగ్ర వినతిపత్రం సమర్పించినట్లు వెల్లడి



ప్రొద్దుటూరు( ప్రజా సీమ): దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు షెడ్యూల్డ్ కుల (ఎస్సీ) హోదాను విస్తరించాలని కోరుతూ ఈనెల 8వ తేదీన జస్టిస్ కె.జి. బాలకృష్ణన్ కమిషన్‌కు ఆంధ్రప్రదేశ్ దళిత సమాఖ్య సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి యల్లయ్య, వ్యవస్థాపకులు కొమ్ముపాలెం శ్రీనివాస్, రాష్ట్ర సలహాదారు దుర్గం సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ, దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలు మతమార్పిడి అనంతరం కూడా తమ కుల మూలాల కారణంగా సామాజిక, ఆర్థిక, విద్యా పరమైన వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కులపరమైన అన్యాయాలు, అస్పృశ్యత ప్రభావాలు, సామాజిక బహిష్కరణలు కేవలం మతం మారినంత మాత్రాన అంతరించిపోవని దేశవ్యాప్తంగా జరిగిన అనేక అధ్యయనాలు, కమిషన్ నివేదికలు స్పష్టం చేశాయని తెలిపారు. భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమానత్వం, గౌరవప్రద జీవితం, మత స్వేచ్ఛ హక్కులను కల్పిస్తుందని, అయితే 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని పేరా--3 కారణంగా దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలు ఇప్పటికీ రాజ్యాంగ పరిరక్షణలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే కుల నేపథ్యం కలిగిన వ్యక్తుల్లో హిందూ, సిక్కు, బౌద్ధ మతాలకు చెందిన వారికి ఎస్సీ హోదా వర్తిస్తుండగా, క్రైస్తవులు మరియు ముస్లింలకు మాత్రమే నిరాకరించడం రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు విరుద్ధమని పేర్కొన్నారు. మతం మారినంత మాత్రాన సామాజిక వాస్తవాలు మారిపోవని పార్లమెంట్ ఇప్పటికే గుర్తించిందని, అందుకే సిక్కు మరియు బౌద్ధ దళితులకు ఎస్సీ హోదా విస్తరించబడిందని గుర్తు చేశారు. జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ సైతం మతాన్ని ఎస్సీ గుర్తింపుకు ప్రమాణంగా పరిగణించకూడదని స్పష్టంగా సిఫారసు చేసిందని, సచార్ కమిటీతో పాటు అనేక సామాజిక అధ్యయనాలు దళిత క్రైస్తవులు, దళిత ముస్లింల వెనుకబాటుతనాన్ని నమోదు చేశాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ 2009, 2019, 2023 సంవత్సరాల్లో దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు ఎస్సీ హోదా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానాలు ఆమోదించిందని గుర్తు చేశారు. ఇది కేవలం ఒక వర్గం డిమాండ్ మాత్రమే కాదని, సామాజిక న్యాయం మరియు రాజ్యాంగ విలువలకు సంబంధించిన అంశమని తెలిపారు. బాలకృష్ణన్ కమిషన్ దేశ సామాజిక వాస్తవాలను పరిగణనలోకి తీసుకుని చారిత్రాత్మక సిఫారసు చేయాలని వారు కోరారు. 1950 నాటి రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వులోని మతపరమైన పరిమితిని తొలగించి, దళిత క్రైస్తవులు మరియు దళిత ముస్లింలకు ఎస్సీ హోదాతో పాటు రిజర్వేషన్లు, విద్యా అవకాశాలు, సంక్షేమ పథకాలు మరియు అన్ని రాజ్యాంగ పరిరక్షణలను విస్తరించాలని డిమాండ్ చేశారు. చారిత్రాత్మక అన్యాయానికి ముగింపు పలికి, రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వాన్ని ఆచరణలోకి తీసుకురావాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందని నాయకులు పేర్కొన్నారు. మతం కారణంగా హక్కులను నిరాకరించే పరిస్థితికి ముగింపు పలకాలని, సామాజిక న్యాయ స్ఫూర్తికి అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు.

# దేవలవారిపల్లెలో "కేత్ బచావో అభియాన్" కార్యక్రమం..

## -నేల సంరక్షణ, శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన





పీలేరు(ప్రజా సీమ)పీలేరు మండలం దేవలవారిపల్లెలో శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖలు మరియు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి సూచనల మేరకు "కేత్ బచావో అభియాన్" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతికి చెందిన సీనియర్ శాస్త్రవేత్త డా. రూపేష్ కుమార్ రెడ్డి రైతులకు నేల సంరక్షణ, పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు, జీవ శిలీంద్రనాశినుల వినియోగంపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షల ప్రాముఖ్యతను వివరించిన ఆయన, వేరుశెనగ విత్తనోత్పత్తిలో రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరించి నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయ సంచాలకులు కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ లోతు దుక్కులు, విత్తన శుద్ధి, కంచె పంటలు, పంట మార్పిడి, సమగ్ర సస్యరక్షణ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని, పంట నమోదు చేసిన రైతులకు మాత్రమే ాూరా×మీా 2.0 ద్వారా యూరియా సరఫరా జరుగుతుందని తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం, కలికిరికి చెందిన శాస్త్రవేత్త సోమశేఖర్ బాబు పంటల్లో నేల ద్వారా సంక్రమించే వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మొదలు కుళ్ళు, వేరుకుళ్ళు, కాండం కుళ్ళు, విల్ట్ వంటి సమస్యలను నివారించే మార్గాలను వివరించారు. మండల వ్యవసాయ అధికారి రమాదేవి మండలంలో రైతులకు అందుబాటులో ఉన్న వివిధ వ్యవసాయ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకురాలు నీరజతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. రైతులు శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను అనుసరించి నేల సారాన్ని కాపాడుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని అధికారులు సూచించారు.

# రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి

## -సంక్షేమం సభ సూపర్ హిట్ -టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి





సిద్ధవటం (ప్రజా సీమ) :ఏపీలో తెలుగుదేశం – జనసేన – బిజెపి కూటమి ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా తిరుపతి నగరం దామినేడులో శుక్రవారం రెండేళ్ల నమ్మకం,అభివృద్ధి,సంక్షేమం పేరిట ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభ సూపర్ సిక్స్ అయిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి శనివారపు మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం సృష్టించిన విధ్వంసం నుండి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపిస్తున్నారన్నారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు సూపర్ హిట్ కావడంతో రాష్ట్ర ప్రజలు ఆనందంగా జీవిస్తున్నారని, అదేవిధంగా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు పెద్దసంఖ్యలో తరలిరావడం ఏపీ అభివృద్ధికి సంకేతమని కొనియాడారు.

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నారన్నారు. ఈసభకు హాజరైన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,ఏపీ బీజేపీ అధ్యక్షులు పివిఎన్ మాధవ్,మంత్రి నారా లోకేష్ బాబు కూటమి పాలనపై అద్భుత ప్రసంగాలు అందించారని ప్రశంసించారు. మున్ముందు కూటమి పాలనలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధిస్తుందని,దేశ చిత్రపటంలో ఏపీ అగ్రగామిగా నిలవడం ఖాయమని వారు అన్నారు.

PRGI Regd. No : APTEL/26/A0819
నేటిపత్రిక
ప్రజాసీమ
జాతీయ తెలుగుదినపత్రిక



# చిన్నకొత్తపల్లి పాఠశాల అప్‌గ్రేడ్‌పై తల్లిదండ్రుల ధర్నా

## -డీఈఓ హామీతో ఆందోళన విరమణ

## -సోమవారం నాటికి ప్రాథమికోన్నత పాఠశాలగా మార్పు కు హామీ








ఒంటిమిట్ట,(ప్రజా సీమ)పాఠశాలల హేతుబద్ధీకరణలో భాగంగా గత విద్యా సంవత్సరంలో ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చిన నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకుని, చిన్నకొత్తపల్లి పాఠశాలను తిరిగి ప్రాథమికోన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఉదయం పాఠశాల ఆవరణలో ధర్నా నిర్వహించారు. డీఈఓ గతంలో ఇచ్చిన హామీ అమలు కాకపోవడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.వివరాల్లోకి వెళితే, 2025--26 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పాఠశాలల హేతుబద్ధీకరణలో భాగంగా చిన్నకొత్తపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను ప్రాథమిక పాఠశాలగా మార్చారు. ఈ నిర్ణయంపై గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ 2025 జూన్ 17న భారీ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ సమయంలో జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ పాఠశాలను సందర్శించి, గ్రామ ప్రజల అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని పాఠశాలను తిరిగి ప్రాథమికోన్నత పాఠశాలగా మారుస్తామని, చిన్నకొత్తపల్లి పాఠశాలను వ్యక్తిగతంగా దత్తత తీసుకుని అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.అయితే 2025--26 విద్యా సంవత్సరం ముగిసి, 2026--27 విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ పాఠశాల హోదాలో ఎలాంటి మార్పు జరగకపోవడంతో తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలోని విద్యార్థులు సమీప ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, ముఖ్యంగా బాలికలు, చిన్నారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఇచ్చిన హామీలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని ఆరోపిస్తూ పాఠశాల వద్ద ధర్నాకు దిగారు.సమాచారం అందుకున్న ఒంటిమిట్ట మండల విద్యాశాఖ అధికారి బ్రహ్మయ్య వెంటనే పాఠశాల వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్‌తో ఫోన్‌లో మాట్లాడి తల్లిదండ్రుల ఆందోళనను వివరించారు. దీనికి స్పందించిన డీఈఓ, చిన్నకొత్తపల్లి పాఠశాలను తిరిగి ప్రాథమికోన్నత పాఠశాలగా మార్చేందుకు అవసరమైన అన్ని ప్రతిపాదనలు, పరిపాలనా చర్యలు ఇప్పటికే పూర్తి చేశామని, ప్రస్తుతం తుది ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. సోమవారం నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుందని, అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశముందని హామీ ఇచ్చారు.డీఈఓ స్పష్టమైన భరోసా ఇవ్వడంతో తల్లిదండ్రులు, గ్రామస్తులు తమ ఆందోళనను విరమించారు. హామీ మేరకు చర్యలు తీసుకోకపోతే మరింత ఉధృతంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యా సౌకర్యాలను తగ్గించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుందని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, సుబ్బరాయుడు, భాస్కర్, విజయరామయ్య, అశోక్, మధు, పాఠశాల చైర్మన్ చైతన్య, సుబ్బయ్య, వెంకటసుబ్బయ్య, అనూష, గౌతమి, జయలక్ష్మి, రాణి, గౌరీతో పాటు పెద్ద సంఖ్యలో మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన సబ్ కలెక్టర్లు



కడప,(ప్రజా సీమ) క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా జిల్లాకు వచ్చిన ఎనిమిది మంది అసిస్టెంట్ కలెక్టర్లు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ని మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.రాష్ట్రంలోని వివిధ ప్రాముఖ్యత కలిగిన ప్రాంతాల క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం జిల్లాలోని సుప్రసిద్ధ పర్యాటక కేంద్రం గండికోటను సందర్శించిన అసిస్టెంట్ కాలెక్టర్ల బృందం.. అనంతరం రాష్ట్రానికే స్ఫూర్తిగా జిల్లా కలెక్టర్ వినూత్న అవిష్కరణతో అమలులోకి వచ్చిన స్మార్ట్ కిచెన్ వ్యవస్థను ప్రత్యక్షంగా పరిశీలించారు. అందులో భాగంగా ఎర్రగుంట్ల స్మార్ట్ కిచెన్ భవనాన్ని పరిశీలించారు. మధ్యాహ్నం కడపలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరిని ఆయన బంగ్లాలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దంపతులు వారితో కలిసి మధ్యాహ్న విందును చేసి.. చక్కటి ఆతిథ్యం అందించారు. శిక్షణలో భాగంగా.. పరిపాలన సంబంధిత అంశాలపై జిల్లా కలెక్టర్ నుండి పలు సూచనలు, సలహాలను స్వీకరించిన అసిస్టెంట్ కలెక్టర్లు కడప జిల్లా చారిత్రక వైభవానికి ఫిదా అయ్యామని ఇక్కడి పర్యాటక వనరులు, ఇక్కడి ప్రజల స్వభావం, జీవనశైలి మమకారం మేళవించినట్లుందని సంతోషం వ్యక్తం చేశారు. మొదటిసారిగా జిల్లాకు వచ్చిన అసిస్టెంట్ కలెక్టర్లకు చిరు కానుకను అందజేసి సత్కరించారు. కాగా చక్కటి ఆతిథ్యం అందించిన జిల్లా కలెక్టర్ దంపతులకు వారు ధన్యవాదాలు తెలియజేసారు.సాయంత్రం జిల్లాలోని చారిత్రక, పురాతన శ్రీ ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఆలయంలను సందర్శించిన అసిస్టెంట్ కలెక్టర్ల బృందం.. జిల్లాలో పర్యటనను ముగించుకుని వెళ్లారు.క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చిన వారిలో.. అసిస్టెంట్ కలెక్టర్లు.. సిహెచ్. శ్రవణ్ కుమార్ రెడ్డి, (ఏలూరు), హరిఓం పాండ్య (శ్రీకాకుళం), జిల్లా ఆదిత్య శర్మ (తూర్పుగోదావరి), నమ్రత్ అగర్వాల్ (కృష్ణా), పవన్ తేజ ఏఆర్ (ఎస్పీఎస్ నెల్లూరు), ప్రియా (కాకినాడ), సుయాన్ కుమార్ (అనంతపురం), వెంకటేష్ బన్న (చిత్తూరు) ఉన్నారు. ఈ కార్యక్రమంలో వారివెంట జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్, స్మార్ట్ కిచెన్స్ జిల్లా నోడల్ అధికారి జోయల్ విజయ్ కుమార్, రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

# సమాజంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేద్దాం

## - డీఈవో సుబ్రహ్మణ్యం,ఫోర్డ్ డైరెక్టర్ జల్లా లలితమ్మ స్పష్టం

## - ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం





మదనపల్లె (ప్రజా సీమ) : బాల కార్మికులు లేని సమాజం నిర్మించాలంటే అది సమిష్టి కృషితోనే సాధ్యమవుతుందని అన్నమయ్య జిల్లా డీఈవో సుబ్రమణ్యం స్పష్టం చేశారు.శుక్రవారం ప్రపంచ బాలకార్మికుల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలలందరూ బడిలోనే ఉండాలని ఆర్ టి ఈ యాక్ట్ ప్రకారం 14 ఏళ్లలోపు బాలలందరూ బడిలో ఉండాలని,ఈ సదుపాయాల్ని ఉపయోగించుకోవాలని చెబుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా ఈ సంవత్సరం 9500 మంది పిల్లలను ఒకటో తరగతిలో నమోదు చేయించడం, కేటాయించిన లక్ష్యం కంటే (104) శాతం ఎక్కువగా పూర్తి చేశామని హర్షం వ్యక్తం చేస్తూ బాల కార్మిక వ్యవస్థను అంతం చేయడానికి వేగంగా చర్యలు తీసుకుందామని ఇచ్చిన మాట నిలబెట్టుకుందామనే గోడపత్రికలను ఆవిష్కరించడం జరిగింది.ఫోర్డ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం క్యాంపెయిన్ పెద్దమంద్యం,మదనపల్లె తంబళ్లపల్లి మండలాలలో మూడురోజులు ప్రణాళిక ప్రకారం నిర్వహించడం జరుగుతుందని,టిఎన్ఆర్ కాలనీ యందు ఫోర్డ్ సిబ్బంది ప్రాథమిక పాఠశాల ప్రధానోపా ధ్యాయులు, లేబర్ ఆఫీసర్,బడి బయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలన్నారు.వలస వచ్చిన కుటుంబాలకు విద్య యొక్క ప్రాముఖ్యత ప్రభుత్వ బడిలో ఉన్న సదుపాయాలు వివరిస్తూ ఆధార్ కార్డు లేని పిల్లలకి క్యాంపెన్ నిర్వహించి ఆధార్ కార్డు ఇప్పించే ఏర్పాటు చేయాలని కోరారు.ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ ఆరు నుండి 14 ఏళ్ల బాలలు బడిలో ఉండాలని,15 నుండి 18 లోపు పిల్లలు ఎటువంటి ప్రమాదకరమైన పనుల్లో ఉండకూడదని వెల్లడించారు.బాల కార్మిక వ్యవస్థకు అందరం కలిసి కట్టుగా నిర్మూలిద్దామనే నినాదంలో లక్ష్యాన్ని చేరుకుందామన్నారు.ఈ కార్యక్రమంలో మండల ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ప్రభాకర్ రెడ్డి,డివిజనల్ లేబర్ ఆఫీసర్ ఇర్ఫాన్ హుస్సేన్,డిప్యూటీ ఎంపీడీవో తిరుపాల్ నాయక్,టిఎన్ఆర్ కాలనీ ఎంపీపీ స్కూల్ హెచ్.ఎం ఉపాధ్యాయులు,ఫోర్డ్ సిబ్బంది నిర్మల,జయలక్ష్మి,సుభాషిణి,స్వర్ణ కుమారి,ప్రభావతిలు పాల్గొన్నారు.

# ఫారెస్ట్ రేంజ్ లో కూంబింగ్

## -అనుమానిత ప్రదేశాలలో అణువణువునా విస్తృత తనిఖీలు

## -ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి



సిద్ధవటం( ప్రజాసీమ) సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ పరిధి అనుమానిత అటవీ ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహిస్తున్నామని ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి తెలిపారు మండల కేంద్రమైన సిద్ధవటం అటవీశాఖ కార్యాలయంలో ఆమె శుక్రవారం మాట్లాడుతూ సిద్ధవటం ఫారెస్ట్ రేంజ్ పరిధి గొల్లపల్లి, మద్దూరు బిట్ అటవీ అనుమానిత ప్రదేశాలలో కడప డీఎఫ్ఓ వినీత్ కుమార్ ఆదేశాలతో శుక్రవారం విస్తృతంగా అణువణువునా కూంబింగ్ నిర్వహించామని కొండ సంపద కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు అటవీ ప్రాంతాలు పచ్చదనంతో ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని గ్రామీణ ప్రాంతాలలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే సమాచారం తెలపాలని సూచించారు ఈ కార్యక్రమంలో డిఆర్ఓ, మత్తర్ భాష, ఎఫ్ బి ఓ లు, మధు, మౌనిక ఎఫ్ ఎస్ ఓ సురేష్ బాబు, ఏబీవో హైమావతి తదితర ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు

# డిప్యూటీ సీఎంను కలిసిన చెంగారి శివప్రసాద్







తిరుపతి (ప్రజా సీమ)శుక్రవారం కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా తిరుపతి జిల్లా దామినిడిలో జరిగిన ద్వితీయ వార్షికోత్సవ విజయోత్సవ సభలో పాల్గొనుటకు తిరుపతికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి ఎయిర్ పోర్ట్ నందు రాయలసీమ జోన్ కన్వీనర్ చెంగారి శివప్రసాద్ స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, సరిగ్గా రెండేళ్ల క్రితం 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఒక చారిత్రక తీర్పును ఇచ్చారని, ప్రజలు ఇచ్చిన అధికారాన్ని బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నామని అన్నారు. ఈ చారిత్రక విజయానికి కారణమైన ప్రతి ఓటరుకు, రైతుకు, నాయకుడికి, కార్యకర్తకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల జీవితాలకు దగ్గరగా ఉండే పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. నవ భారత నిర్మాణంలో పంచాయతీల పాత్రను వివరించారు. భావితరాలు గర్వించే సమాజాన్ని నిర్మించడమే కూటమి ప్రభుత్వ సమష్టి బాధ్యత అని అయన తెలియజేసినట్లు చెప్పారు.

# పీ.హెచ్.డిలో ప్రవేశాలకు మిట్స్ దరఖాస్తులు ఆహ్వానం

## - రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ వెల్లడి




మదనపల్లె (ప్రజా సీమ) : మదనపల్లె సమీపంలోని మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఫుల్ టైం మరియు పార్ట్ టైమ్ పీహెచ్.డి కార్యక్రమాలలో ప్రవేశాల కోసం అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ డి.ప్రదీప్ కుమార్ తెలిపారు.యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్,కంప్యూటర్ సైన్స్,ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్,ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్,మెకానికల్ ఇంజినీరింగ్,సివిల్ ఇంజినీరింగ్,మేనేజ్‌మెంట్ స్టడీస్,గణితశాస్త్రం,భౌతికశాస్త్రం,రసాయన శాస్త్రం మరియు ఇంగ్లీష్ విభాగాలలో పీహెచ్.డి ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ఆయన అన్నారు.విశ్వవిద్యాలయ నిబంధనలు అర్హత ప్రమాణాలు, ప్రవేశ పరీక్ష (మిట్స్ డాక్టోరల్ అడ్మిషన్స్ టెస్ట్ మిట్స్ డాట్ - 2026),ఇంటర్వ్యూ మరియు ఇతర నియమావళి ఆధారంగా అభ్యర్థులకు ప్రవేశాలు కల్పించబడతాయన్నారు.ఈ దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీజూన్ 25,2026 అని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ www.mits.ac.iఅను సందర్శించాలని సూచించారు.మరిన్ని వివరాలకు 7416484 422,910 0973262 నంబర్లను సంప్రదించవచ్చని రిజిస్ట్రార్ అన్నారు.ఈ కార్యక్రమంలో అడ్వైసర్ ఆర్ అండ్ డి డాక్టర్ తులసీరామ్ నాయుడు,అసోసియేట్ డీన్ డాక్టర్ నంద కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

## - డీబీఎస్ఎఫ్ డిమాండ్




పీలేరు(ప్రజా సీమ)పీలేరు పట్టణంలో తప్పుడు పేర్లు, తప్పుడు ప్రచారాలతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను మోసం చేస్తూ అడ్మిషన్లు చేపడుతున్న ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి, ఆయా పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ (డీబీఎస్ఎఫ్) ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు బద్దె భాను ప్రకాష్ డిమాండ్ చేశారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, పీలేరు పట్టణంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలు సరైన అనుమతులు, గుర్తింపులు లేకుండానే నిర్వహించబడుతున్నప్పటికీ మండల విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలు విద్యార్థుల నుంచి పుస్తకాలు, యూనిఫాంలు, బ్యాగుల పేరుతో వేల రూపాయలు వసూలు చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.అనుమతులు లేకుండా పాఠశాలలు నిర్వహిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న యాజమాన్యాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.మండల విద్యాశాఖ అధికారులు ఈ అంశంపై స్పందించకపోతే, దళిత బహుజన విద్యార్థి ఫెడరేషన్ తరపున జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామని బద్దె భాను ప్రకాష్ హెచ్చరించారు.అయితే, ఈ ఆరోపణలపై సంబంధిత విద్యాశాఖ అధికారులు లేదా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల స్పందన తెలియాల్సి ఉంది.

# డ్రై డే ఫ్రైడే తప్పనిసరి

## -పరిసర ప్రాంతాలు శుభ్రత పాటించండి
## -మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు

సిద్ధవటం (ప్రజా సీమ) మలేరియా వ్యతిరేకత మాసోత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు సూచనలు అందించారు మండలంలోని పి కొత్తపల్లి ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ రంగ లక్ష్మి ఆదేశాల మేరకు మంగళవారం వంతాటి పల్లె గ్రామంలో జూన్ 1 నుండి 30 తేదీ వరకు జరిగే మలేరియా వ్యతిరేకత వారోత్సవాలపై ప్రజలకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకుంటే ఆరోగ్యం గా ఉండాలని దోమ కుట్టకుండా రాత్రి వేళలో దోమతెర, తప్పనిసరిగా వాడాలని పరిసర ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే దోమలు వ్యాప్తి చెందుతాయని నివారణ కొరకై ప్రతి ఒక్కరూ నీరు నిలువ లేకుండా చూడాలని మీ గృహాలలో ఉన్న తొట్లలో వారానికి ఒకరోజు చొప్పున పాత నీటిని తొలగించి కొత్త



నీటిని నింపాలని దీనివల్ల దోమలు వ్యాప్తి చెందకుండా అరికట్టవచ్చని ప్రతి శుక్రవారం డ్రై డే, ఫ్రైడే పాటించి పరిసర ప్రాంతాలు శుభ్రంగా పెట్టుకోవాలని తెలిపారు ఏదైనా ఆరోగ్య సమస్యలు ఉంటే స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి వైద్యుని సంప్రదించాలని తెలిపారు ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు, సూపర్వైజర్లు, మౌలాలి, శారదా దేవి, ఆరోగ్య కార్యకర్తలు, ఆదిలక్ష్మి, కృష్ణమ్మ హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# పెనగలూరు మండల పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం



పెనగలూరు ( ప్రజాసీమా )33 కేవీ తిమ్మయ్యగారిపల్లి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పెనగలూరు విద్యుత్ శాఖ అధికారి తెలిపారు.ఫీడర్ పరిధిలో లిచెట్ల కొమ్మల తొలగింపు అడవి మొక్కల తొలగింపు అలాగే అవసరమైతే జంపర్ రెక్టిఫికేషన్ పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరా వ్యవస్థను మరింత మెరుగుపరచడం, అంతరాయాలను నివారించడం మరియు వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ఈ పనుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో తిమ్మయ్యగారిపల్లి ఫీడర్ పరిధిలోని గ్రామాల ప్రజలు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ అంతరాయాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పనులు నిర్ణీత సమయానికి పూర్తయిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.విద్యుత్ వినియోగదారులు శాఖకు సహకరించి అసౌకర్యాన్ని సహనంతో భరించాలని కోరారు.

# తిరుపతి సభకు తరలి వెళ్లిన టిడిపి తెలుగు తమ్ముళ్లు

## -కూటమి రెండేళ్ల పాలన సభను విజయవంతం చేద్దాం
## -టిడిపి యువ నాయకులురాజు కుంట నరసింహ

చిట్వేలి(ప్రజా సీమ) రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలాన్ని పూర్తిచేసుకుని అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్లిన విజయోత్సవ సభను విజయవంతం చేసేందుకు కూటమి నాయకులు కదలి రావాలని రాజు కుంట నరసింహ, పిలుపు మేరకు భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు జనసేన, బిజెపి, ఆయన ఆధ్వర్యంలో తిరుపతికి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం, తిరుపతికి సభకు వెళుతున్న కూటమినేతల్లో నూతన ఉత్సాహం నెలకొంది. విజయోత్సవ సభ విజయవంతం చేసేందుకు మేము సైతం అంటూ ప్రతి కార్యకర్త బయలుదేరే ఉత్సాహాన్ని రెట్టింపు ఉత్సాహంగా రాజుకుంట నర



సింహ, ఆధ్వర్యంలో కూటమి నాయకులు బయలుదేరారు. 21 గ్రామపంచాయతీ నుండి కూటమి నాయకులుకార్యకర్తలు సభకు వెళ్లారు.ఈ కార్యక్రమంలో కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

# అంగళ్లులో వైఎస్సార్సీపీ నిరసన ర్యాలీకి అనూహ్య స్పందన

## - కూటమి వైఫల్యాలపై కదం తొక్కిన వైసీపీ శ్రేణులు







కురబలకోట (ప్రజా సీమ) : వైఎస్ఆర్సిపి రాష్ట్ర అధినాయకత్వం సూచనలు,తంబళ్లపల్లె నియోజకవర్గం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆదేశాల మేరకు వెన్నుపోటుకు రెండేళ్లులో భాగంగా శుక్రవారం అంగళ్లు టమోటా మార్కెట్ నుండి అంగళ్లు సర్కిల్ వరకు బైక్ ర్యాలీ,భారీ ఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.సి ఈశ్వర్ రెడ్డి,జిల్లా ఉపాధ్యక్షుడు బైసాని చంద్రశేఖర్ రెడ్డి,నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి నేరెళ్ల రెడ్డి హరి,మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,వైసిపి నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు దేవి రెడ్డి పద్మజా రెడ్డి,పెద్దమండ్యం మండలం ఎంపిపి రమేష్ పూర్ణచంద్రిక,కురబలకోట మండల మహిళా అధ్యక్షురాలు నక్కా రమాదేవిలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు చంద్రబాబు ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు.ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్యాకేజీ స్టార్ కాదు,ఇప్పుడు క్యాబేజీ స్టార్ అని విమర్శించారు.చంద్రబాబు మహిళలకు వెన్నుపోటు పొడిచాడని,బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీగా చరిత్రలో నిలిచిపోతారన్నారు.పెట్రోల్,డీజిల్, వంటగ్యాస్,నిత్యావసరాలు,విద్యుత్ చార్జీలు అమాంతం పెంచేసి సామాన్యుల నడ్డి విరిచారని ఆరోపించారు.మాజీ సీఎం వైఎస్ జగన్ పాలనతో పోల్చుకుంటే 10 శాతం పాలన కూడా కూటమి ప్రభుత్వం చేయలేదన్నారు.కరోన లాంటి కష్టకాలంలో కూడా జగన్ ఇచ్చిన హామీలు నెరవేర్చారని,కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమని ఘాటు విమర్శలు చేశారు.కూటమి ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలను ప్రజలు గమనిస్తున్నారని త్వరలో జరగబోవు స్థానిక సంస్థలు ఎన్నికలు,2029లో జరిగే శాసనసభ ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్.సి ఈశ్వర్ రెడ్డి,జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సాంబశివ,నియోజవర్గం బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డి హరి,ఆర్టిఐ నియోజవర్గం అధ్యక్షుడు అనిపిరెడ్డి కులదీప్ రెడ్డి,యూత్ అధ్యక్షుడు కోళ్ల వాసుదేవ రెడ్డి,వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు బైసాని చంద్రశేఖర్ రెడ్డి,ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు శివ,నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు దేవిరెడ్డి పద్మజా రెడ్డి,గుడిపల్లి మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి,నాయనబావి మాజీ సర్పంచ్ జయరాం రెడ్డి,గొల్లపల్లి మాజీ సర్పంచ్ విజయ్ భాస్కర్ రెడ్డి,తుమ్మలగుంట మాజీ సర్పంచ్ అమరనాథ్ రెడ్డి,ప్రచార విభాగం టంగుటూరి విశ్వనాథ్,మండల బూత్ కమిటీ అధ్యక్షులు చాంద్,బీసీ సెల్ నియోజవర్గం అధ్యక్షుడు రెడ్డి శేఖర్ నాయుడు,సగినాల కేశవ,కురబలకోట బూత్ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు,వైసిపి మండల అధ్యక్షులు కురబలకోట మండల అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి,తంబళ్లపల్లి వైసీపీ మండల అధ్యక్షుడు రేపన చౌడేశ్వర తదితరులు పాల్గొన్నారు.

# కో-ఎడ్యుకేషన్ ఉర్దూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

## - ఉర్దూ భాషా వికాసానికి ప్రభుత్వం కృషి చేయాలి
## - కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు డాక్టర్ ఎస్.కే బాషా డిమాండ్

మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రం మదనపల్లెలో మైనార్టీ విద్యార్థులు ఉర్దూ మీడియంలో ఇంటర్మీడియట్ చదువుకోటానికి కో-ఎడ్యుకేషన్ ఉర్దూ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ ఎస్.కే బాషా డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉర్దూ మీడియం ఇంటర్ మీడియట్ అభ్యసించదానికి,అవకాశాలు లేకపోవడం వల్ల ఉర్దూ చదువుకునే విద్యార్థులు అర్ధాంతరంగా తమ చదువును ఆపుకొని దూరమవుతున్న పరిస్థితి కనబడుతోందన్నారు.ఇంటర్మిడియట్లో రాయచోటి,మదనపల్లె ప్రాంతాల్లో బాలికలకు ఉర్దూ మీడియం అందుబాటులో ఉందని,బాలురకు మాత్రం గుర్రంకొండ,మహాల్ లో మాత్రమే జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం ఉందని జిల్లాలో మరెక్కడా ఉర్దూ మీడియంలో చదువుకునే అవకాశం లేకపోవడం వల్ల ఆర్థికంగా వెనుకబడ్డ మైనార్టీలు తమ బిడ్డలను చదివించుకునే అవకాశం లేక వారిని కార్మికులుగా మార్చుతున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.కావున ఇంటర్మీడియట్లో ఉర్దూ విద్యను అభ్యసించే వారి అవసరాన్ని ప్రభుత్వము,పాలకులు,ఉన్నతాధికారులు గుర్తించి జిల్లా కేంద్రం మదనపల్లెలో ఉర్దూ మీడియం కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఈ విషయంపై త్వరలోనే జిల్లా కలెక్టర్,డీఈఓను కలిసి వినతిపత్రం




అందించనున్నట్లు స్పష్టం చేశారు.రాష్ట్ర విద్యా శాఖ మంత్రి కూడా,మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించే ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు.జూనియర్ ఇంటర్లో ఉర్దూ మీడియం బాలురకు అందుబాటులో లేకపోవడం వల్ల వారి విద్యాభ్యాసం పదవ తరగతి వరకే పరిమితం అవుతోందని,ఇలాంటి పరిస్థితులను అధిగమించే విధంగా చదువుకోవాలని ఆసక్తి ఉన్నవారికి అవకాశం కల్పించే పరిస్థితిని ప్రభుత్వం అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

# బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

## -సిద్ధవటం ఎస్సై హారిక



సిద్ధవటం( ప్రజా సీమ )బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్ధవటం ఎస్సై హారిక హెచ్చరించారు. సిద్ధవటం మండలంలోని సంటిగారి పల్లిలో గురువారం రాత్రి గ్రామసభ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్లైన్ మోసాలు, బ్యాంక్ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చీటింగ్, ఫ్యాక్షన్, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. శక్తి' యాప్ ను ఉపయోగించడం వల్ల పోలీసులు మహిళలకు కల్పించే రక్షణ గురించి వివరించారు. గ్రామాల్లో ప్రశాంతతను నెలకొల్పడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

## పీలేరు జూనియర్ కళాశాలలో బీఎల్ఓల రాత పరీక్ష నిర్వహణ



పీలేరు(ప్రజా సీమ)ప్రత్యేక ఓటరు జాబితా సవరణప్రక్రియకు సంబంధించి గతంలో నిర్వహించిన శిక్షణ తరగతుల్లో బోధించిన అంశాలపై బీఎల్ఓలు ఎంత మేరకు అవగాహన కలిగి ఉన్నారో అంచనా వేసేందుకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదేశాల మేరకు శుక్రవారం పీలేరు జూనియర్ కళాశాలలో బీఎల్ఓలకు రాత పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలను ఆర్డీవో నారాయణరెడ్డి, పీలేరు నియోజకవర్గ పరిధిలోని తహసిల్దార్లు పరిశీలించారు. ఎన్నికల ప్రక్రియలో బీఎల్ఓలు సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు అవసరమైన అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడమే ఈ పరీక్షల ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా ఓటరు జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలపై బీఎల్ఓలకు ఇప్పటికే శిక్షణ అందించగా, వాటిపై వారి అవగాహన స్థాయిని మదింపు చేసేందుకు ఈ రాత పరీక్షను నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లు, పరీక్ష నిర్వహణ తీరును ఆర్డీవో నారాయణరెడ్డి, తహసిల్దార్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ప్రతి బీఎల్ఓ బాధ్యతాయుతంగా పనిచేయాలని అధికారులు సూచించారు

## ప్రైవేట్ పాఠశాలల నిలువు దోపిడీని అరికట్టాలి

### - బహుజన యువసేన నాయకుల డిమాండ్
### - జిల్లా అదనపు విద్యాశాఖాధికారి హరి కుమార్ కి వినతి



మదనపల్లె (ప్రజా సీమ) : అన్నమయ్య జిల్లా కేంద్రమైన మదనపల్లె పట్టణంలోని ప్రైవేట్,కార్పొరేట్ పాఠశాలల్లో జరుగుతున్న ఫీజుల దోపిడీ,నిబంధనల ఉల్లంఘనలు,అక్రమ యూనిఫాం మరియు పుస్తకాల విక్రయాలు,అనుమతులు లేకుండా తరగతుల నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ కుమార్ మదనపల్లి డీఈఓ కార్యాలయంలో జిల్లా అదనపు విద్యాశాఖాధికారి (ఏడి) హరి కుమార్ కి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ తల్లిదండ్రులను తీవ్రంగా ఆర్థికంగా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,అక్రమాలకు పాల్పడుతున్న పాఠశాలలపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల బివైఎస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

## చలో తిరుపతి .. భారీగా తరలిన టిడిపి శ్రేణులు



సిద్ధవటం (ప్రజా సీమ )చలో తిరుపతి ఎన్డీఏ కూటమి విజయవంత సభకు కార్యక్రమానికి సిద్ధవటం మండలం నుంచి తరలిన టీడీపీ శ్రేణులు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, రాజంపేట ఇంచార్జ్ జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో సిద్ధవటం మండలం నుంచి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున "చలో తిరుపతి" కార్యక్రమానికి బయలుదేరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా రాజంపేట టీడీపీ పార్లిమెంట్ ఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి మాట్లాడుతూ రెండు సంవత్సరాలలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి, పారదర్శక పాలనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఫలాలు అందేలా కృషి చేయడం కూటమి ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధవటం మండల అధ్యక్షులు రాజశేఖర్ యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ రాజా నాయుడు పార్లమెంటుఉపాధ్యక్షులు నాగమునిరెడ్డి, సీనియర్ తెలుగుదేశం నాయకులు చెంచయ్య నాయుడు, శ్రీను, సిద్ధవటం మాజీ సర్పంచ్ భవనాసి ఓబులయ్య, సీనియర్ బీసీ నాయకుడు పుత్త బాబు, సుబ్బారెడ్డి, మచుపల్లి సుబ్బా రెడ్డి, నాగభూషణం నాయుడు, ఓబులేష్ నాయుడు, బాలినేని సుబ్బరాయుడు, కాడే శ్రీనివాసులు నాయుడు,వెంకట సుబ్బయ్య, శంకర్ శ్రీను కార్యకర్తలు పవన్ పాల్గొన్నారు

## అభివృద్ధి పథంలో వైరా ని ఇంకా ముందు తీసుకెళ్తాను అంటున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్



జూలూరుపాడు జూన్12: (ప్రజా సీమ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలంలోని వ్యవసాయ రంగం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకుపోతుందని వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే అన్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగునీటి వసతులను మరింత మెరుగుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైరా నియోజకవర్గానికి అభివృద్ధి పరంగా ముందుకు సాగుతుందని ఏనుకూరు మండలంలోని ఇంటిగ్రేటెడ్ స్కూలు ప్రారంభిస్తున్నామని మరియు అదేవిధంగా ఐటిఐ కాలేజ్ మరియు ఏనుకూరు మండలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయాసిస్ సెంటర్ ఏర్పాటు చేశామని అత్యాధునిక పరికరాలతో వైద్య సేవలు మెరుగుపరిచామని అదేవిధంగా వ్యవసాయము వైద్యం పెద్దపీట వేశామని వారన్నారు వ్యవసాయ రంగానికి అవసరమైన నీటి అవసరాలను బట్టి సీతారామ ప్రాజెక్టు కెనాల్ నుండి వైరా రిజర్వాయర్కు నీటిని తరలిస్తున్నామని చెప్పారు. అదేవిధంగా మండలాల్లోని రైతులకు చిన్న, పిల్ల కాలువల ద్వారా సాగునీటిని అందిస్తూ పంటల సాగుకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు వ్యవసాయ రంగంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు సాధించాలని ఆయన సూచించారు. అల్లాడి నరసింహారావు ఏన్మార్ మార్కెట్ చైర్మన్ లచ్చునాయక్. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోత్ మంగీలాల్ నాయక్. దుద్దుకూరి మధుసూదన్ రావు. వేల్పుల నరసింహారావు. రామిశెట్టి రాంబాబు. . నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

## మల్లయ్య,సాదుకొండలలో మైనింగ్ అనుమతులు ఉపసంహరించాలి

### - మంత్రి కొల్లు రవీంద్రకు పి.సురేంద్ర యాదవ్ వినతి



మదనపల్లె (ప్రజా సీమ) : తంబళ్లపల్లి నియోజకవర్గంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన మల్లికార్జున స్వామి దేవాలయం మల్లయ్యకొండపైన వెలసిందని,సాధుకొండలో పురాతన శివాలయం ఉందని మల్లయ్య కొండలోని భాగమైన సాధుకొండలో ఐరన్ ఓర్ తవ్వకాల అనుమతులను పరిశీలించి మత విశ్వాసాలు,హిందువుల మనోభావాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని తంబళ్లపల్లి నియోజకవర్గ మల్లికార్జున స్వామి పుణ్యక్షేత్ర భక్తుల తరపున భూగర్భగనులు,ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రకి తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్ వినతిపత్రం అందజేశారు. గురువారం మదనపల్లి పర్యటనకు విచ్చేసిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి మల్లయ్య,సాదుకొండల మైనింగ్ అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఇది మతవిశ్వాసాలకు కేంద్రమని,హిందువుల మనోభావాలకు వ్యతిరేకంగా తవ్వకాలు జరపడమనేది ఒక వర్గాన్ని,ఒకరకంగా భావోద్వేగాలకు గురిచేస్తుందన్నారు. ఈ కొండ సుమారు 15,200 ఎకాలరాలు వ్యాపించి ఉందని,ఈ కొండ చుట్టుపక్కల ఉన్న తంబళ్లపల్లి మండలం,పెద్దమండ్యం మండలాల్లో సుమారు 60,000 మంది ప్రజలు జీవిస్తున్నారు. ఈ కొండ చుట్టు పక్కల ఉన్న గ్రామాల్లో పురాతన చిన్నచిన్న హిందూ దేవాలయాలు వెలిశాయని,ఈ దేవాలయాల మీద కూడా ఈ తవ్వకాల ప్రభావం పడుతుందన్నారు. అంతేకాకుండా వాతారణం పూర్తిగా కలుషతమవుతుందని,ఈ కొండకు చుట్టుప్రక్కల ప్రసిద్ధి గాంచిన పుణ్యక్షేత్రాలు నేలమల్లేశ్వర స్వామి దేవాలయం,ఏనుగుమల్లమ్మ కొండ,గణపతి గుడి, సాధుకొండలో పురాతన శివాలయాలు ఉన్నాయన్నారు. అంతేకాకుండా చిన్న,చిన్న శివాలయాలు, ఇతర దేవతల కు సంబందించిన దేవాలయాలు ఉన్నాయని,ఇక్కడ తవ్వకాలు జరపడమనేది ఈ దేవాలయాలు,చుట్టుప్రక్కల జీవిస్తున్న ప్రజల జీవన విధానం మీద దీని ప్రభావం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ చుట్టుపక్కల వాతావరణం పూర్తిగా కలుషితమవుతుందని,ఈ విషయాన్ని పరిశీలించాల్సిందిగా ఆయన మంత్రిని కోరారు. ఈ అంశాలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి తెలిపారని సురేంద్ర యాదవ్ వెల్లడించారు.

## 44వ ఆక్వా కల్చర్ ఎక్షపో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం ముఖ్య అతిధులుగా..డిప్యూటీ స్పీకర్ రఘురామ, జిల్లా కలెక్టర్ నాగరాణి, చైర్మన్ జుత్తుగ








భీమవరం,(ప్రజా సీమ) : గురువారం పచ్చిమగోదావరి జిల్లా ఉండి కోట్ల ఫంక్షన్ హాల్లో జరిగిన 44వ ఆక్వా కల్చర్ ఎక్షపో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవం ముఖ్య అతిధులుగా హాజరైన ఉండి శాసనసభ్యులు, డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామ కృష్ణంరాజు, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, ఉండి నియోజవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ జుత్తుగ నాగరాజు. ఏపీ ఆక్వా కల్చర్ ప్రెసిడెంట్ గాంధీ భగవాన్ రాజు, పశ్చిమగోదావరి జిల్లా ఆక్వా కల్చర్ ప్రెసిడెంట్ తులసి రాంబాబు, పాల్గొన్నారు.

## కోటగుడిబండ సచివాలయంలో లబ్ధిదారులకు సబ్సిడీ దాణా అందజేత..

కలకడ(ప్రజా సీమ)అన్నమయ్య జిల్లా కలకడ మండలం కోటగుడిబండ గ్రామ పంచాయతీ సచివాలయంలో పశువుల పెంపకందారులకు ప్రభుత్వం అందిస్తున్న పశువుల దాణా సబ్సిడీ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ పూర్ణిమ, వెటర్నరీ అసిస్టెంట్ చంద్రమోహన్ పాల్గొని అర్హులైన పశు పోషకులకు సబ్సిడీపై పశువుల దాణాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పశు సంవర్ధక రంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. పశువుల పెంపకం ద్వారా రైతులు అదనపు ఆదాయం పొందేందుకు ఈ సబ్సిడీ పథకాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకుడు ఆనందరెడ్డి పాల్గొని లబ్ధిదారులకు దాణా పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, పశుపోషకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లాలో మహిళలు, చిన్నారుల రక్షణపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో విస్తృత అవగాహన సదస్సులు

భీమవరం, : పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఐ.పి.ఎస్ ఆదేశాల మేరకు మహిళలు, చిన్నారుల భద్రతను అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణిస్తూ జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణను చేపట్టింది.

ఈ క్రమంలో జిల్లావ్యాప్తంగా నియమించబడిన 'శక్తి టీమ్స్' నేతృత్వంలో జూన్ 12, శుక్రవారం పాలకొల్లు మున్సిపల్ ఆఫీస్, ఎలమంచిలి జెడ్పీ హై స్కూల్, భీమవరం ఆర్టీసీ బస్ స్టాండ్, శ్రీనివాస సెంటర్, మెంటేవారితోట వంటి రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు మహిళలకు ఎదురయ్యే భద్రతా సవాళ్లను సమర్థవంతంగా అధిగమించే మార్గాలను వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళలకు రక్షణ కవచంగా నిలిచే 'శక్తి యాప్' వినియోగం, దాని ప్రాముఖ్యతపై ఈ సదస్సుల్లో పాల్గొన్న వారికి పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. నేటి డిజిటల్ యుగంలో ఎదురవుతున్న సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియా వినియోగంలో పాటించాల్సిన గోప్యతా నియమాలు, భద్రతా ప్రమాణాల గురించి పోలీసు అధికారులు కూలంకషంగా చర్చించారు. ముఖ్యంగా బాలికల రక్షణ కోసం రూపొందించిన 'పోక్సో' (గూజూూ) చట్టంలోని కఠిన నిబంధనలను వివరిస్తూ, వారి భద్రత పట్ల సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. మహిళా సంబంధిత నేరాల పట్ల ఎటువంటి సంకోచం లేకుండా పోలీసులను ఆశ్రయించాలని, బాధితుల వ్యక్తిగత గోప్యతను కాపాడుతూ తక్షణమే స్పందించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం సిద్ధంగా ఉందని అధికారులు స్పష్టం చేశారు.

Published BY B Ramasubba Reddy, PRINTED AT VSAR PUBLICATIONS, DOOR NO. 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002, PUBLISHED AT 41/1077, SANKARAPURAM, KADAPA, YSR Kadapa District, ANDHRA PRADESH-516002 EDITOR: B Ramasubba Reddy, RNI NO: APTEL/26/A0819, Cell: 9515583664 Email: svscollegerjpt@gmail.com. Owner: Vasantha Lakshmi Narasamma